జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## ఆదిలాబాద్

## మంచిర్యాల-కుమరం భీం-నిర్మల్

శనివారం 18 జూలై 2026 పేజీలు : 8




## జూలై 31లోగా రేషన్ కార్డుల ఈ-కేవైసీ పూర్తి చేయాలి



## జిల్లాలో ఎస్సీ, ఎస్టీల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత



జిల్లాలో షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ), షెడ్యూల్డ్ తెగల (ఎస్టీ) సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య తెలిపారు. మంచిర్యాల జిల్లా నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డీసీపీ ఎ. భాస్కర్, జిల్లా అటవీ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, అదనపు కలెక్టర్లు పి. చంద్రయ్య, వి. రాములు, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, కమిషన్ సభ్యులు, జిల్లా అధికారులతో కలిసి శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు.

## గిరిజన గ్రామాల్లో విద్య, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు




గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమ ని, గిరిజన విద్యార్థులకు నా ణ్యమైన విద్యతో పాటు అ న్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఐటీడీఏ ని రంతరం కృషి చేస్తోందని సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఐటీడీఏ ఉట్నూరు ప్రాజెక్టు అధికారి మంద మ కరందు అన్నారు.

## తెలంగాణ విద్యుత్‌కు సింగరేణి భరోసా-రాష్ట్ర అవసరాలకే తొలి ప్రాధాన్యం




- ప్రస్తుతం తెలంగాణ విద్యుత్ కేంద్రాలకు 72 శాతం బొగ్గు సరఫరా
- ఎల్‌నినో పరిస్థితులకు అనుగుణంగా మరింత బొగ్గు సరఫరాకు కార్యాచరణ
- సింగరేణి--జెన్‌కో సమన్వయ సమావేశంలో సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతి

# పెంచిన వేతనాలు కొనసాగించాలి

### -- ఆడిట్ అభ్యంతరాలు ఉపసంహరించాలి

### మంచిర్యాల మున్సిపల్ పీహెచ్, నాన్-పీహెచ్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వినతి

### తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు వినతిపత్రం

**మంచిర్యాల, 17, జులై (ప్రజా జ్యోతి):** మంచిర్యాల జిల్లాలోని మున్సిపల్ పబ్లిక్ హెల్త్ (పీహెచ్), నాన్-పబ్లిక్ హెల్త్ (నాన్-పీహెచ్) విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పెంచిన వేతనాలను యథావిధిగా కొనసాగించాలని, జిల్లా ఆడిట్ అధికారి లేవనెత్తిన అభ్యంతరాలను ఉపసంహరించుకోవాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్డ్ తెగల కమిషన్‌కు మంచిర్యాల మున్సిపల్ పీహెచ్, నాన్-పీహెచ్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ప్రతినిధులు వినతిపత్రాన్ని సమర్పించారు. వివరాల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలను మూడు దఫాలుగా పెంచింది. మొదటగా జూన్ 11, 2021న జీ.ఓ.ఎం.ఎస్. నెం.60 మరియు జూన్ 15, 2021న జీ.ఓ.ఎం.ఎస్. నెం.63 ద్వారా 30 శాతం వేతన పెంపు అమలు చేసింది. దీంతో కేటగిరీ--1 ఉద్యోగుల వేతనం రూ.12,000 నుంచి రూ.15,600కు, కేటగిరీ--2 ఉద్యోగుల వేతనం రూ.15,000 నుంచి రూ.19,500కు, కేటగిరీ--3 ఉద్యోగుల వేతనం రూ.17,500 నుంచి రూ.22,750కు పెరిగిందని తెలిపారు .తర్వాత మే 1, 2023న జీ.ఓ.ఎం.ఎస్. నెం.40 ద్వారా అన్ని కేటగిరీల ఉద్యోగులకు అదనంగా రూ.1,000 పెంచి కేటగిరీ--1కు రూ.16,600, కేటగిరీ--2కు రూ.20,500, కేటగిరీ--3కు రూ.23,750గా నిర్ణయించింది. అనంతరం ఫిబ్రవరి 2, 2024న సీడీఎంఏ మెమో నెం.6603/ఇంజి(1)/2023-3 ద్వారా మరో రూ.1,000 పెంచి ప్రస్తుతం కేటగిరీ--1కు రూ.17,600, కేటగిరీ--2కు రూ.21,500, కేటగిరీ--3కు రూ.24,750 వేతనాలు అమల్లో ఉన్నాయని తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వం జీ.ఓ.ఆర్.టి. నెం. 970 (06-05-2024), జీ.ఓ.ఆర్.టి. నెం.1037 (12-06-2024) ద్వారా మున్సిపాలిటీల్లో కొనసాగుతున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నియామకాలను, వారికి చెల్లించిన వేతనాలను ర్యాటిఫై చేసినట్లు వినతిపత్రంలో పేర్కొన్నారు. అనంతరం సీడీఎంఏ మెమో ఆర్.ఓ.సి. నెం.790829/2025/జి-2, తేదీ 20-03-2025 ద్వారా ప్రస్తుతం విధుల్లో ఉన్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జీ.ఓ.ఆర్.టి. నెం.1037 ప్రకారం అమలులో ఉన్న వేతనాలనే కొనసాగించాలని, జీ.ఓ.ఆర్.టి. నెం.69లో నిర్ణయించిన వేతనాలు కొత్తగా నియమించబడే ఉద్యోగులకు మాత్రమే వర్తిస్తాయని స్పష్టం గా ఆదేశాలు జారీ చేసినట్లు వివరించారు. అయితే ఈ ప్రభుత్వ ఉత్తర్వులు, సీడీఎంఏ ఆదేశాలను పరిగణనలోకి తీసుకోకుండా మంచిర్యాల జిల్లా ఆడిట్ అధికారి ప్రస్తుతం చెల్లిస్తున్న వేతనాలను "అదనపు చెల్లింపులు (ఎక్సెస్ పేమెంట్)"గా పేర్కొంటూ ఆర్డీఎంఏ వరంగల్‌కు నివేదిక



పంపినట్లు తెలిపారు. ఆడిట్ అభ్యంతరాల ప్రకారం పబ్లిక్ హెల్త్ వర్కర్ల వేతనాన్ని రూ.17,600 నుంచి రూ.16,600కు, డ్రైవర్ల వేతనాన్ని రూ.21,500 నుంచి రూ.16, 600కు, డేటా ఎంట్రీ ఆపరేటర్ల వేతనాన్ని రూ.24,750 నుంచి రూ.19,500కు, ఆఫీస్ సబార్డినేట్లు తదితర ఉద్యోగుల వేతనాన్ని రూ.17,600 నుంచి రూ.15,600కు తగ్గించాలని సూచించినట్లు తెలిపారు. దీని వల్ల ప్రతి నెల ఉద్యోగులకు రూ.1,000 నుంచి రూ.5,250 వరకు నష్టం వాటిల్లే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. అలాగే ఇప్పటికే చెల్లించిన వేతనాలను కూడా రికవరీ చేయాలని ఆడిట్ నివేదికలో సూచించినట్లు తెలిపారు. బెల్లంపల్లి మున్సిపాలిటీ లో రూ.27,32, 728, మందమర్రి మున్సిపాలిటీలో రూ.10,21,18 2, చెన్నూరు మున్సిపాలిటీలో రూ.11,56,016, నస్పూర్ మున్సిపా లిటీలో రూ.24,13,666 చొప్పున మొత్తం రూ.73,23,592 రికవరీ చేయాలని ప్రతిపాదించినట్లు వినతిపత్రంలో వివరించారు .ఈ నిర్ణయం అమలైతే వందలాది మంది మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, ముఖ్యంగా షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు చెందిన కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. అనేక సంవత్సరాలుగా మున్సిపల్ సేవలను అందిస్తున్న తమ జీవనోపాధి, సేవా హక్కులు ప్రమాదంలో పడతాయని అన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ తక్షణమే జోక్యం చేసుకుని ప్రభుత్వం జారీ చేసిన జీ.ఓ.ఆర్.టి. నెం.1037, సీడీఎంఏ మెమో ప్రకారం ప్రస్తుతం అమలులో ఉన్న పెంచిన వేతనాలను కొనసాగించాలని, మంచిర్యాల జిల్లా ఆడిట్ అధికారి పంపిన అభ్యంతర నివేదికను రద్దు చేయించాలని, ఇప్పటికే చెల్లించిన వేతనాలను రికవరీ చేయకుండా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని, పీహెచ్, నాన్-పీహెచ్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సేవా హక్కులు, జీవనోపాధిని పరిరక్షించాలని వినతిపత్రంలో కమిషన్‌ను కోరారు.

## ఓటు హక్కు పరిరక్షణకు కాంగ్రెస్ బీఎల్ఏలు కృషి చేయాలి

: ఆత్రం సుగుణక్క

ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన డీసీసీ అధ్యక్షురాలు

అర్హులందరి పేర్లు ఓటరు జాబితాలో నమోదు చేయాలి

ఓటరు జాబితాలో అర్హుల పేర్లు తొలగిపోకుండా అప్రమత్తంగా ఉండాలి

కెరమెరి మండలంలో బీఎల్ఏలతో డీసీసీ అధ్యక్షురాలు సుగుణక్క సమీక్ష



**ఆసిఫాబాద్ జూలై 17 ప్రజా జ్యోతి** రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును అర్హులైన ప్రతి పౌరుడు పొందేలా కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏలు సమర్థవంతంగా పనిచేయాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క అన్నారు. శుక్రవారం కెరమెరి మండలంలోని లెండిగూడ, భోలాపటార్, నారాయణగూడ, అంతపూర్, గౌరి, గౌరి ఎస్సీ కాలనీ గ్రామాల్లో ఆమె పర్యటించి ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్ఏలు, పార్టీ నాయకులతో సమావేశమై ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని సమీక్షించారు. అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా కృషి చేయాలని సూచించారు. ప్రజలకు ఓటరు నమోదు, సవరణ ప్రక్రియలో ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించేలా కాంగ్రెస్ శ్రేణులు అందుబాటులో ఉండాలని సుగుణక్క తెలిపారు. రాజ్యాంగబద్ధమైన ఓటు హక్కును పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, బీఎల్ఏలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బెల్ట్ షాపులు మూసేయాలని మహిళల ఆందోళన

కలెక్టర్, ఎస్పీకి వినతి పత్రం అందజేత

కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయని ఆవేదన



**ఆసిఫాబాద్జులై 17 ప్రజా జ్యోతి** కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలంలోని చిచ్పల్లి, సోనాపూర్, గణేశపూర్, పోనగూడతో పాటు మొత్తం 7 గ్రామాల మహిళలు తమ గ్రామాల్లోని అక్రమ మద్యం బెల్ట్ షాపులను వెంటనే మూసివేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఊరిలోనే బెల్ట్ షాపులు ఉండటం వల్ల తమవారు మద్యానికి బానిసలవుతున్నారని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబాలను పట్టించుకోకుండా ఆరోగ్యాన్ని పాడుచేసుకుంటున్నారని, పిల్లల చదువు, కుటుంబ పోషణ భారంగా మారిందని ఆందోళన తెలిపారు. గతంలో వాంకిడి ఎస్ఐకి వినతి పత్రం ఇచ్చినా స్పందన లేదని, అందుకే 7 గ్రామాల మహిళలం దరూ కలిసి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. తమ గ్రామాల్లో ఉన్న 10 బెల్ట్ షాపులను మూయించేలా చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమానికి ఆల్ ఇండియా డెమోక్రటిక్ విమెన్స్ అసోసియేషన్ ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు నంది పద్మ, భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్, జిల్లా సహాయ కార్యదర్శి దుర్గం రాజ్ కుమార్, ఆల్ ఇండియా యూత్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఆత్మకూరి చిరంజీవి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు విమల బాయి, సుప్రియ, గీత, అంజలి, రేష్మ తదితరులు పాల్గొన్నారు.

## వర్షాకాల వ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన

వైద్య శిబిరంలో 42 మందికి ఉచితంగా మందుల పంపిణీ



**ఆసిఫాబాద్, జులై 17 ప్రజా జ్యోతి:** కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలంలోని గిరిజన గ్రామాల్లో రాపిడ్ ఫీవర్ సర్వేలో భాగంగా సల్పలా గూడ కనర్గాం ఉప కేంద్రంలో శుక్రవారం ఇంటింటి ఫీవర్ సర్వే, ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. వర్షాకాలంలో దోమల ద్వారా వ్యాపించే మలేరియా, డెంగీ, చికెన్‌గునియా వంటి వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. దోమలు వృద్ధి చెందకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను అధికారులు వివరించారు. రాబోయే మూడు నెలల పాటు ప్రతి ఒక్కరూ నీటిని కాచి చల్లార్చి తాగాలని, వారానికి ఒకసారి ఇంట్లోని టబ్బులు, డ్రమ్ములు శుభ్రం చేయాలని, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు. ఈ సందర్భంగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి 42 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి రవిదాస్, ఎంఎల్‌హెచ్‌పి ఉమారత్నమాల, అంగన్వాడీ కార్యకర్త కౌసల్య, ఆశా కార్యకర్త పార్వతి పాల్గొన్నారు.

# సింగరేణి భరోసా యాత్రపై బీఆర్ఎస్ టీబీజీకేఎస్ విమర్శలు వాస్తవాలను కప్పిపుచ్చే ప్రయత్నమే

**ఏబీకేఎంఎస్--బీఎంఎస్ జాతీయ కార్యదర్శి పి. మాధవ నాయక్**

**ఏబీకేఎంఎస్--బీఎంఎస్లో భారీగా చేరికలు**





**మంచిర్యాల, 17, జూలై (ప్రజా జ్యోతి):**కొత్తగూడెం బీఎంఎస్ భవన్లో కార్పొరేట్ ఏరియా ఉపాధ్యక్షుడు బి. రామ్‌సింగ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాలకు చెందిన ఉద్యోగులు భారీ సంఖ్యలో సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ (ఏబీకేఎంఎస్--బీఎంఎస్)లో చేరారు. నూతన సభ్యులకు సంఘం జాతీయ కార్యదర్శి పి. మాధవ నాయక్ సభ్యత్వ పత్రాలు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పి. మాధవ నాయక్ మాట్లాడుతూ, సింగరేణి బీఎంఎస్‌పై కార్మికుల్లో రోజురోజుకు విశ్వాసం పెరుగుతోందని, కార్మికుల హక్కుల కోసం సంఘం నిరంతరం పోరాడుతున్నందుకే ఉద్యోగులు స్వచ్ఛందంగా బీఎంఎస్‌లో చేరుతున్నారని అన్నారు. కేంద్ర బొగ్గు మరియు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి చేపట్టిన 'సింగరేణి భరోసా యాత్ర' పై బీఆర్ఎస్, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘ్ (టీబీజీకేఎస్) నాయకులు చేస్తున్న విమర్శలు పూర్తిగా రాజకీయ ప్రేరేపితమైనవని, వాస్తవాలను ప్రజల దృష్టి నుంచి మళ్లించే విఫల ప్రయత్నమని విమర్శించారు. సింగరేణి ప్రస్తుతం ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభానికి గత ప్రభుత్వాల విధానాలే కారణమని, వేల కోట్ల రూపాయల బకాయిలు పేరుకుపోవడంతో సంస్థపై సుమారు 54 వేల కోట్ల భారం పడిందని తెలిపారు. ఉద్యోగుల జీతాలను కూడా ఓవర్‌డ్రాఫ్ట్ ద్వారా చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడటం బాధాకరమన్నారు. కోయగూడెం, జేవీఆర్ ఓసీ వంటి బొగ్గు గనుల వేలంపాటల్లో సింగరేణి పాల్గొనకుండా అడ్డుకుని ప్రైవేటు సంస్థలకు అవకాశాలు కల్పించిన విషయాన్ని ప్రజలు మర్చిపోలేదన్నారు. గతంలో జరిగిన ఆ నిర్ణయాల వల్ల సింగరేణికి జరిగిన నష్టానికి బాధ్యత వహించాల్సినవారే ఇప్పుడు కార్మికుల సంక్షేమంపై మాట్లాడడం ఆశ్చర్యకరమన్నారు. కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి చొరవతో నైనీ బొగ్గు గనికి అవసరమైన అనుమతులు సాధించడంతో పాటు, వీకే ఓసీ, గోలేటి ఓసీ, పూసపల్లి ఓసీ ప్రాజెక్టులకు అనుమతులు లభించాయని చెప్పారు. అలాగే 340 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు కలిగిన తాడిచెర్ల--2 బొగ్గు బ్లాక్‌ను ఎలాంటి వేలంపాట లేకుండా నేరుగా సింగరేణికి కేటాయించడం సంస్థ భవిష్యత్తుకు కీలక నిర్ణయమన్నారు. 'సింగరేణి భరోసా యాత్ర' ద్వారా సంస్థ ఎదుర్కొంటున్న వాస్తవ పరిస్థితులు ప్రజలకు తెలియడంతో వాటిని జీర్ణించుకోలేక కొందరు రాజకీయ విమర్శలకు దిగుతున్నారని అన్నారు. కార్మికుల హక్కులు, సింగరేణి అభివృద్ధి, సంస్థ భవిష్యత్తు కోసం ఏబీకేఎంఎస్ బీఎంఎస్ రాజీపడకుండా తన పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని పి. మాధవ నాయక్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జి.వి. కృష్ణారెడ్డి, టి.ఎస్. పవన్ కుమార్, మొగిలిపాక రవి, బాలకృష్ణ, అశోక్, ప్రవీణ్, నరేష్, కాసర్ల మోహన్, శైలేష్ కిరణ్, భీమా, శ్రావణ్ కుమార్, రాజేష్, చంద్రశేఖర్, వడ్డీ కాసులు, మోహన్ లాల్, ధారావత్ నాగేశ్వరరావు, దినేష్, సుధాకర్, సంగం చెందర్, అల్లి ప్రకాష్, ఎం. శ్రీనివాస్, ఐనపనూరి నాగేశ్వరరావు, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## పీఏసీఎస్ చైర్మన్, డైరెక్టర్ల నియామకాల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషనలు అమలు చేయాలి

**బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం తెలంగాణ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు, హైకోర్టు న్యాయవాది పేరం అలేఖ్య**



**మంచిర్యాల, 17, జూలై (ప్రజాజ్యోతి):** ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (పీఏసీఎస్) చైర్మన్, డైరెక్టర్ల నియామకాల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను తప్పనిసరిగా అమలు చేయాలని బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం తెలంగాణ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు, హైకోర్టు న్యాయవాది పేరం అలేఖ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం పీఏసీఎస్‌లకు రైతుల ఓట్ల ద్వారా ఎన్నికలు నిర్వహించకుండా నామినేటెడ్ విధానంలో చైర్మన్, డైరెక్టర్లను నియమించాలని నిర్ణయించిన నేపథ్యంలో, ఈ నియామకాల్లో సామాజిక న్యాయం ప్రతిబింబించేలా రిజర్వేషన్ల ప్రాతిపదికన పదవులు కేటాయించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. నామినేటెడ్ విధానంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అవకాశం కల్పిస్తున్నప్పటికీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు రాజ్యాంగబద్ధమైన రిజర్వేషన్లను అమలు చేస్తే అన్ని వర్గాల వారికి సముచిత ప్రాతినిధ్యం లభిస్తుందని అలేఖ్య అన్నారు. రిజర్వేషన్లు లేకుండా నియామకాలు చేపడితే ఆర్థికంగా బలమైన వ్యక్తులకే పదవులు దక్కే అవకాశం ఉందని, అందువల్ల ఎమ్మెల్యేలు కులాల వారీగా రిజర్వేషన్లను పాటిస్తూ చైర్మన్, డైరెక్టర్ పదవులను కేటాయించాలని ఆమె కోరారు. పీఏసీఎస్‌ల నియామకాలలో బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు న్యాయం జరిగేలా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తగిన చర్యలు తీసుకోవాలని పేరం అలేఖ్య విజ్ఞప్తి చేశారు.

## సోనాలలో 'తెలంగాణ పబ్లిక్ స్కూల్' ఏర్పాటు చేయాలి

**: ఎమ్మెల్యేకు బిఆర్ఎస్ నాయకుల వినతి**



**సోనాల, జూలై 17 ప్రజాజ్యోతి** సోనాల మండల కేంద్రంలో నే 'తెలంగాణ పబ్లిక్ స్కూల్' ను ఏర్పాటు చేయాలని కోరుతూ మండల బిఆర్ఎస్ నాయకులు స్థానిక ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గారికి శనివారం వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, సోనాల మరియు దాని చుట్టుపక్కల ఉన్న పదికి పైగా గ్రామాల్లో పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వందలాది మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో నాణ్యమైన ఆంగ్ల మాధ్యమ విద్యావకాశాలు లేకపోవడంతో, విద్యార్థులు చదువుల కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కావున ఎట్టి పరిస్థితుల్లో సోనాల మండలానికి కె తెలంగాణ పబ్లిక్ స్కూల్ కేటాయించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ నాయకులు పి. చిన్నయ్య, సుధీర్ రెడ్డి, తుల శ్రీకాంత్, ఇర్ల అఖిల్, మృనాల్ గౌడ్, బత్తుల రమేష్, తుల హరీష్ పాల్గొన్నారు.

# అద్దె భవనాల్లోనే గురుకులాలు.. విద్యార్థులకు దిక్కేది?

**సొంత భవనాలు, సౌకర్యాలు కల్పించాలని**

**ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు కె.వి.పి.ఎస్ వినతి**



**ఆసిఫాబాద్ జులై 17 ప్రజా జ్యోతి** కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో వేలాది మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది. సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో నడిచే గురుకుల పాఠశాలలు వసతి గృహాలకు ఇప్పటికీ సొంత భవనాలు లేవు. అనేక చోట్ల అద్దె భవనాల్లోనే తరగతులు, వసతులు కొనసాగుతున్నాయి. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇరుకైన గదులు, సరిపడా తాగునీరు, మరుగుదొడ్లు, స్నానాల గదులు లేకపోవడంతో విద్యార్థుల ఆరోగ్యం ప్రమాదంలో పడుతోంది. వంటశాలలు, భోజనశాలలు, గ్రంథాల యాలు, ప్రయోగశాలలు, క్రీడా మైదానాలు, ప్రహరీ గోడలు వంటి కనీస సౌకర్యాలు కూడా లేక విద్యాభ్యాసానికి, భద్రతకు ఆటంకం ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో కె.వి.పి.ఎస్ జిల్లా నాయకులు రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ అధ్యక్షులకు వినతి పత్రం అందజేసి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

**వారి ప్రధాన వినతులు:**

రెబ్బెన సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలకు వెంటనే స్వంత భవనం మంజూరు చేయాలి జిల్లా కేంద్రం లో 1971 నుంచి ఉన్న పాత సాంఘిక సంక్షేమ వసతి గృహానికి కొత్త భవనం నిర్మించాలి సిర్పూర్(టి) సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల, కళాశాలకు సొంత భవనం ఇవ్వాలి జిల్లా కేంద్రం లో గిరిజన బాలికల గురుకుల డిగ్రీ కళాశాలకు శాశ్వత భవనం మంజూరు చేయాలి జిల్లాలోని అన్ని గురుకులాలను పరిశీలించి సొంత భవనాలు లేని వాటికి వెంటనే భవనాలు నిర్మించాలి మౌలిక సదుపాయాల కోసం ప్రత్యేక నిధులు విడుదల చేయాలని ప్రభుత్వానికి సిఫారసు చేయాలి 'విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలు వద్దు' అంటూ కె.వి.పి.ఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, జిల్లా నాయకులు మల్లేష్ ప్రభుత్వం వెంటనే స్పందించాలని విజ్ఞప్తి చేశారు.

# జిల్లాలో ఎస్సీ, ఎస్టీల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోంది





రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



**మంచిర్యాల, 17, జూలై (ప్రజాజ్యోతి):**జిల్లాలో షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ), షెడ్యూల్డ్ తెగల (ఎస్టీ) సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య తెలిపారు. మంచిర్యాల జిల్లా నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డీసీపీ ఎ. భాస్కర్, జిల్లా అటవీ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, అదనపు కలెక్టర్లు పి. చంద్రయ్య, వి. రాములు, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, కమిషన్ సభ్యులు, జిల్లా అధికారులతో కలిసి శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సమావేశంలో ఎస్సీ, ఎస్టీలకు సంక్షేమ పథకాల అమలు, అట్రాసిటీ కేసులు, భూ సమస్యలు, ఆశ్రమ పాఠశాలలు, అటవీ హక్కుల చట్టం (ఆర్ఓఎఫ్ఆర్), గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. బక్కి వెంకటయ్య మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులను పకడ్బందీగా అమలు చేసి ఎస్సీ, ఎస్టీల సంక్షేమం కోసం అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచించారు. జిల్లాలో 56 వేల 969 మంది ఎస్టీలు, 1 లక్ష 99 వేల 493 మంది ఎస్సీలు ఉన్నారని, వారికి అర్హత మేరకు అన్ని సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు, దుప్పట్లు, బంకర్ బెడ్స్, పోషకాహారం అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థుల భద్రత కోసం సీసీ కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ జరుగుతోందన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల వినియోగం, ఉపాధి హామీ పథకం అమలు, స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా రూ.20 లక్షల వరకు రుణ సదుపాయం, గ్రామీణ మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. మంచిర్యాల జిల్లాలో విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశాలు, పౌర హక్కుల దినోత్సవాలను సమర్థవంతంగా నిర్వహించడం వల్ల అట్రాసిటీ కేసులు తగ్గుముఖం పట్టడం అభినందనీయమన్నారు. వెయ్యికి పైగా కేసులు నమోదయ్యే జిల్లాల్లో ప్రత్యేక న్యాయస్థానాల ఏర్పాటు ప్రతిపాదించామని, మంచిర్యాల జిల్లాలో కూడా ప్రత్యేక కోర్టు ఏర్పాటు దిశగా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. అటవీ హక్కుల చట్టం ప్రకారం అర్హులైన గిరిజనులు, గిరిజనేతరులకు భూ పట్టాలు జారీ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని, రెవెన్యూ, అటవీ, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భూ సమస్యల పరిష్కారం, ప్రభుత్వ ఉద్యోగుల పదోన్నతుల్లో రోస్టర్ విధానం అమలు, బెల్ట్ షాపుల నిర్మూలన, మున్సిపాలిటీల్లో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు సకాలంలో వేతనాలు, పీఎఫ్, బీమా సౌకర్యాల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. అలాగే ఎస్సీ, ఎస్టీ గ్రామాల్లో రహదారులు, తాగునీటి సౌకర్యం కల్పించడం, అట్రాసిటీ బాధితులకు త్వరితగతిన పరిహారం అందించడం, అవుట్‌సోర్సింగ్ నియామకాల్లో ఎస్సీ, ఎస్టీలకు ప్రాధాన్యం ఇవ్వడం, కులాంతర వివాహాల ప్రోత్సాహకాలు, విదేశీ విద్య ఉపకార వేతనాలు, బెస్ట్ అవైలబుల్ పాఠశాలల బకాయిలకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, జిల్లాలో ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తూ, అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు దమ్మ నారాయణ, చిలుక రాజనర్సు, దుర్గ మల్లయ్య, పెద్ది రాజన్న, పౌర సరఫరాల కమిటీ సభ్యుడు జిల్లపల్లి వెంకటేష్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బంబారా హైవేపై సౌకర్యాలు కల్పించాలి

### నాయబ్ తహసీల్దార్‌కు సీపీఐ వినతిపత్రం

### విద్యార్థులు, ప్రజల భద్రతకు చర్యలు తీసుకోవాలి: బొయిరే ప్రకాష్



**ఆసిఫాబాద్ , జూలై 17** ప్రజా జ్యోతి కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం లోని బంబారా గ్రామపంచాయతీ పరిధిలోని జాతీయ రహదారిపై ప్రజలు, విద్యార్థులు సురక్షితంగా రాకపోకలు సాగించేలా అవసరమైన సౌకర్యాలను వెంటనే ఏర్పాటు చేయాలని కోరుతూ భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) నాయకులు శుక్రవారం మండల నాయబ్ తహసీల్దార్ రామ్‌లాల్‌కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా సీపీఐ కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బొయిరే ప్రకాష్ మాట్లాడుతూ, జాతీయ రహదారి నిర్మాణం తర్వాత గ్రామస్థులు ఒక వైపు నుంచి మరో వైపుకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు, మహిళలు, వృద్ధులు ప్రమాదకర పరిస్థితుల్లో రహదారిని దాటాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల భద్రత దృష్ట్యా బంబారా వద్ద అండర్‌పాస్ వంతెన, బస్ షెల్టర్, పాదచారుల సౌకర్యాలు, రహదారి మధ్యలో సెంట్రల్ లైటింగ్‌ను తక్షణమే ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారానికి స్పందించకపోతే సీపీఐ ఆధ్వర్యంలో దశలవారీగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ప్రజలందరూ ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి కొందురుపాక మహేష్, ఏఐవైఎఫ్ మండల అధ్యక్షుడు పిప్పిరి వెంకటేష్, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వర్కులు రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



**బోథ్, జూలై 17 (ప్రజా జ్యోతి)** పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎం ఎల్ హెచ్ పి సౌజన్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం మండలంలోని బాబేర తాండ గ్రామంలో సర్పంచ్ రూప్ చందుతో కలిసి గ్రామస్తులకు సీజనల్ వ్యాధులపై పరిసరాలు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, సూచించారు. చెత్తాచెదారం లేకుండా ప్రతి ఒక్కరూ చూసుకోవాలని, ఇంటి పరిసరాలలో మురికి నీరు నిలువ లేకుండా చూసుకోవాలని తెలిపారు. దీంతో సమాజం ఆరోగ్యంగా ఉంటుందని, వ్యాధులకు దూరంగా ఉండవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నేషనల్ గ్రీన్ కోర్లో పాత ఎల్లాపూర్ హైస్కూల్లో మొక్కలు నాటిన సర్పంచ్ ప్రశాంత్ రెడ్డి



**ఖానాపూర్ జూలై 17( ప్రజా జ్యోతి )** ఖానాపూర్ మండలంలోని పాత ఎల్లాపూర్ హైస్కూల్లో నేషనల్ గ్రీన్ కోర్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సర్పంచ్ ఏలేటి ప్రశాంత్ రెడ్డి మొక్కలు నాటారు పచ్చదనం పరిశుభ్రతతో తో పాటు పాఠశాల ఆవరణలో సుందరవణాన్ని ఏర్పాటు చేయాలని అన్నారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆసురి రమాదేవి ఉపాధ్యాయులు విద్యార్థులు పంచాయతీ పాలకవర్గ సభ్యులు పాఠశాల విద్యా కమిటీ తదితరులు పాల్గొన్నారు

## ఒకటో వార్డులో గర్భిణీ స్త్రీలకు సామూహిక సీమంతం



**ఖానాపూర్ జూలై 17 (ప్రజా జ్యోతి )** ఖానాపూర్ మున్సిపాలిటీ లోని ఒకటవ వార్డులో గర్భిణీ స్త్రీలకు సామూహిక, సిమంతం కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఒకటో వార్డు కౌన్సిలర్ గౌర్రె తిరుమల పాల్గొని గర్భిణీనిలకు చీర జాకెట్ లతోపాటు పూలు, పండ్లు స్వీట్ లను అందించారు ఈ సందర్భంగా కౌన్సిలర్ గౌర్రె తిరుమల మాట్లాడుతూ మహిళలు గర్భం దాల్చిన వెంటనే స్థానిక అంగన్వాడీ కేంద్రాల్లో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా భోజనంతో పాటు అవసరమయ్యే పౌష్టిక పదార్థాలను అందించడం జరుగుతోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ మానస గర్భిణి స్త్రీలు తదితరులు పాల్గొన్నారు

# జూలై 31లోగా రేషన్ కార్డుల ఈ-కేవైసీ పూర్తి చేయాలి

లబ్ధిదారులు గడువులోగా నమోదు చేసుకోవాలి

జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు సూచన



**మంచిర్యాల, 17, జూలై (ప్రజాజ్యోతి):** జాతీయ ఆహార భద్రతా చట్టం పరిధిలోని జిల్లాలోని అన్ని రేషన్ కార్డుదారులు ఈ నెల 31వ తేదీలోగా తప్పనిసరిగా ఈ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు సూచించారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని తన ఛాంబర్‌లో పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీకళతో కలిసి మండల రేషన్ షాప్ డీలర్ల సంఘం ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రేషన్ కార్డుల్లో నమోదైన లబ్ధిదారుల వివరాల పారదర్శకతను నిర్ధారించడం, నకిలీ లబ్ధిదారులను గుర్తించి తొలగించడం, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ రాయితీ ప్రయోజనాలు నిరంతరాయంగా అందేలా చేయడమే ఈ-కేవైసీ ప్రక్రియ లక్ష్యమని తెలిపారు. జిల్లాలో ఇంకా గణనీయమైన సంఖ్యలో లబ్ధిదారులు ఈ-కేవైసీ పూర్తి చేయలేదని పేర్కొంటూ, మండల స్థాయిలో ప్రత్యేక కార్యాచరణ చేపట్టి జిల్లాలో 100 శాతం ఈ-కేవైసీ పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రేషన్ కార్డులో నమోదైన ప్రతి కుటుంబ సభ్యుడు స్వయంగా సంబంధిత లేదా సమీపంలోని ఏదైనా రేషన్ దుకాణానికి వెళ్లి ఈ-పోస్ యంత్రం ద్వారా వేలిముద్రలు నమోదు చేసి ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలని సూచించారు. గడువులోగా ఈ-కేవైసీ పూర్తి చేయని లబ్ధిదారులు భవిష్యత్తులో రేషన్ పంపిణీ సమయంలో ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని హెచ్చరించారు. అందువల్ల జిల్లాలోని రేషన్ కార్డుదారులందరూ వెంటనే ఈ-కేవైసీ పూర్తి చేసుకుని ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను నిరంతరాయంగా పొందాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పౌర సరఫరాల శాఖ అధికారులు, మండల రేషన్ షాప్ డీలర్ల సంఘం ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# బొక్కలగుట్టలో సీసీ కెమెరాలు

కానిస్టేబుల్ వెంకటేశ్వర్లుకు ప్రశంసలు



**రామకృష్ణాపూర్,జూలై 17(ప్రజా జ్యోతి):**రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బొక్కలగుట్ట గ్రామంలో నేరాల నియంత్రణ, ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ లక్ష్యంగా 12 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ ఐపీఎస్, బెల్లంపల్లి ఏసీపీ వి. కిరణ్ కుమార్, మందమర్రి సీఐ పి. రమేష్, రామకృష్ణాపూర్ ఎస్ఐ జె. శ్రీధర్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల నేరాల నియంత్రణ, నేరస్తుల గుర్తింపు, ప్రజల్లో భద్రతా భావం పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ప్రజల సహకారంతో మరిన్ని గ్రామాల్లో కూడా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు.సీసీ కెమెరాల ఏర్పాటుకు విశేషంగా కృషి చేసిన రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లును మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ ఘనంగా సత్కరించి అభినందించారు. గ్రామ భద్రత కోసం ఆయన చూపిన చొరవను అధికారులు ప్రశంసించారు.

## రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు " సింగరేణి విశ్రాంత ఉద్యోగుల " సమస్యలపై వినతిపత్రం

ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి



**మంచిర్యాల, 17, జూలై (ప్రజాజ్యోతి):** సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని కోరుతూ జిల్లా సింగరేణి వాలంటరీ రిటైర్మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ (వి.ఆర్.ఎస్. 41/48--97) ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ కార్మికులు, కర్షకులు, ఉపాధి కల్పన అంశాలపై నిర్వహించిన చర్చా వేదికలో జిల్లా కలెక్టర్ సబిత సమక్షంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బూడిది గోపాలకృష్ణ నేతృత్వంలో 11 అంశాలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ, సింగరేణిలో పనిచేసి పదవీ విరమణ పొందిన వేలాది మంది కార్మికులు తీవ్ర ఆర్థిక, సామాజిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వారికి కనీసం నెలకు రూ.10,000 పెన్షన్ అమలు చేయడంతో పాటు, ప్రతి మూడు నెలలకు డీఏ పెరుగుదలను పెన్షన్‌కు జతచేసి చెల్లించాలని కోరారు. అదేవిధంగా, బెల్లంపల్లి ఏరియాలో సుమారు మూడు వేల మంది విశ్రాంత కార్మికులకు సర్వే నంబర్లతో కూడిన సింగరేణి క్వార్టర్ల స్థలాలను ఉచితంగా కేటాయించినట్లే, మిగతా ఏరియాల్లోని విశ్రాంత కార్మికులకు కూడా 250 గజాల ఇంటి స్థలం లేదా రూ.50 లక్షల ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం సింగరేణి మెడికల్ కార్డుపై ఉన్న రూ.8 లక్షల వైద్య పరిమితిని రూ.25 లక్షలకు పెంచాలని, కోల్ ఇండియాలో అమలవుతున్న విధంగా ప్రతి కార్మికునికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి కంటి ఆపరేషన్లు, లెన్సులు, కళ్లద్దాలు అందించే పథకాన్ని సింగరేణిలో కూడా అమలు చేయాలని కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సానుకూలంగా స్పందిస్తూ, విశ్రాంత కార్మికుల న్యాయమైన సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం అసోసియేషన్ ప్రతినిధులు చైర్మన్ బక్కి వెంకటయ్యను శాలువాతో ఘనంగా సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు, విశ్రాంత ఉద్యోగులు, సభ్యులు పాల్గొన్నారు.

## శ్రీ ధనలక్ష్మి సెలక్షన్స్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ సెకండరీ బాలికల పాఠశాలకు ప్యూరిఫైయర్ వాటర్ ఫిల్టర్ అందజేత



**ఖానాపూర్ జూలై 17 (ప్రజా జ్యోతి)** విద్యార్థుల సౌకర్యార్థం ఖానాపూర్ పట్టణంలోని శ్రీ ధనలక్ష్మి సెలక్షన్స్ ప్రొప్రైటర్ చౌదారపు రవీందర్ సతీమణి శ్రీమతి కీర్తిశేషులు చౌదారపు శ్యామల జ్ఞాపకార్థం జిల్లా పరిషత్ బాలికల పాఠశాల ఖానాపూర్ విద్యార్థినిల యొక్క అవసరాలను గుర్తించి 40 వేల విలువగల ప్యూర్ పై వాటర్ ఫిల్టర్ ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎంఈఓ శ్రీమతి బి సంధ్యారాణి కి అందజేశారు ఈ సందర్భంగా పాఠశాల తరపున వాటర్ ప్యూరిఫై వాటర్ ఫిల్టర్ బహిష్కరించిన ధనలక్ష్మి యజమాన్యాన్ని ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి బీసంధ్యారాణి ఉపాధ్యాయ బృందము పట్టణ వ్యాపార వేత్త గంప గంగాధర్, మధ్యాహ్నం భోజన సిబ్బంది విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీ గిరిజనుల సమస్యల పరిష్కారం కోసం కృషి

రాజ్ గోండ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు సోయం బాపూ రావు





**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 17, (ప్రజా జ్యోతి)** ఆదివాసి గిరిజను లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని మాజీ ఎంపీ రాజ్ గోండ్ సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు సోయం బాపూరావు అన్నారు. ఆదివాసీ సమస్యలు, ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకల ఏర్పాట్ల పై ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లో రాజ్ గోండ్ సేవసమితి ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహిం చారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిధిగా రాజ్ గోండ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు సోయం బాపూరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగానే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆదివాసీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ప రిష్కారం చేసే విధంగా కృషి చేస్తామన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇండ్లను ఆదివాసీలకు మంజూ రు చెయ్యాలని, ఎస్ ఐ ఆర్ లో ఫామ్ నింపి ప్రతి ఒక్కరు తమ ఓటును కాపాడుకోవాలని, ఆదివాసీ యువత దీ నిపై ప్రతి ఒక్కరికి వివరించి గ్రామాల్లో అవగాహన కల్పించాలని కోరారు. టైగర్ జోన్ పరిధిలో రోడ్లు ఇతర సమస్యలపై రాజ్ గోండ్ సేవా సమితి పోరాటాలు చెయ్యడా నికి సిద్ధం అవు తుందన్నారు. వచ్చే నెల 9వ తేదీన ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నామని, ఇంద్ర వెల్లిలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు ఉంటాయన్నారు. ప్రతి ఒక్క ఆదివాసీ యువత, మహిళా ఉద్యోగులు, మేధావులు ప్రజలు వచ్చే నెల ఆగస్టు 9వ తేదీన ఇంద్ర వెల్లిలో జరిగే మహిళా దినో త్సవం వేడుకలకు హాజరై తమ బలాన్ని చూపించాలని కోరారు. అనంతరం నాగో బా ఆలయంలో పూజలు చేశారు. సమావేశంలో రాజ్ గోండ్ సేవ సమితి సభ్యులు ఆదివాసీ నాయకులు తదితరు లు పాల్గొన్నారు.

## ఓటరు ఫారాల డిజిటలైజేషన్ వేగవంతం చేయాలి

: కలెక్టర్ కుమార్ దీపక్



రామకృష్ణాపూర్,జూలై 17(ప్రజా జ్యోతి):జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం క్యాతన పల్లి మున్సిపాలిటీ 3,4వ వార్డులో తహసీల్దార్ సతీష్ కుమార్ తదితర అధికారులతో కలిసి ప్రత్యేక సవరణ ప్రక్రియను ఆయన పరిశీలించారు. భారత ఎన్నికల సంఘం డిజిటలైజేషన్ గడువును ఆగస్టు 3 వరకు పొడిగించిన నేపథ్యంలో ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. బూత్ స్థాయి అధికారులు సేకరించిన ఎన్యుమరేషన్ ఫారాల వివరాలను బీఎల్ఓ యాప్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని, బీఎల్ఏలు సహకరించాలని కోరారు. అర్హులైన ఓటర్లు స్వయంగా ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించి, ఓటరు జాబితా సవరణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

## సర్ ప్రక్రియను వేగవంతం చేయాలి కూచాడి శ్రీహరి రావు



లక్షణ చాంద, జూలై 17 (ప్రజా జ్యోతి) సర్ ప్రక్రియను వేగవంతం చేయాలని నిర్మల్ జిల్లా నియోజక వర్గం ఇన్చార్జ్ కూచాడి శ్రీహరి రావు అన్నారు. శుక్రవారం రోజున కనకాపూర్, వద్యాల్, రాచాపూర్, లక్ష్మణ చాంద, మునిపల్లి గ్రామాలను సందర్శించి ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్) ప్రక్రియను సమీక్షించారు. అర్హత ఉన్న ఓటరుకు అవకాశం కల్పించేలా సమన్వయంతో పనిచేయాలని బి ఎల్ ఓ, బిఎల్ఏ లకు సూచించారు. వద్యాల్ గ్రామంలో సర్ ప్రక్రియ 100% పూర్తి అయిన సందర్భంలో బివిఎల్ఓ, బిఎల్ ఏ లను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ మార్కెట్ కమిటీ అధ్యక్షులు సోమ్ భీమ్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోండ్ర నరేష్ రెడ్డి, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు ఈటల శ్రీనివాస్, గ్రామ సర్పంచులు సంఘని రాజు, పసుపుల నరేష్, బూసి మహేష్, ఓడ్నాల వెంకట్, కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు ఓడ్నాల రాజేశ్వర్, నాయకులు ప్రతాపరెడ్డి, గురాల లింగారెడ్డి,మాజీ సర్పంచులు గంగాధర్ గౌడ్, తునికి నారాయణ, శాతం గంగారాం, మేకల రాజేందర్, ఉప సర్పంచులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగ, కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలి

### 55 ఏళ్లు దాటిన కార్మికులకు రూ.3 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్, నెలకు రూ.6 వేల పెన్షన్ ఇవ్వాలి

### మున్సిపల్ కార్మికుల జీతాలు తగ్గిస్తే ఊరుకునేది లేదు ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు సీఐటీయూ వినతి

మంచిర్యాల, 17, జూలై (ప్రజాజ్యోతి):మంచిర్యాల జిల్లాలోని సంఘటిత, అసంఘటిత రంగాల ఉద్యోగులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు మంచిర్యాల కలెక్టర్ కార్యాలయం ద్వారా వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, శానిటేషన్ కార్మికులు, స్కీమ్ వర్కర్లు, భవన నిర్మాణ కార్మికులు, హమాలీలు, ఇతర విభాగాల ఉద్యోగులు చాలీచాలని వేతనాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కుటుంబ పోషణ, పిల్లల చదువులు, ఇంటి అద్దెలు, నిత్యావసరాల ధరల పెరుగుదలతో వారి జీవనం భారంగా మారిందన్నారు. వీరిలో అత్యధికులు ఎస్సీ, ఎస్టీ, బీసీ తదితర బడుగు బలహీన వర్గాలకు చెందిన వారేనని అన్నారు. పెరిగిన జీవన వ్యయాన్ని దృష్టిలో ఉంచుకొని అన్ని వర్గాల ఉద్యోగులు, కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26 వేలుగా నిర్ణయించాలని, ఉద్యోగ భద్రతతో పాటు పెన్షన్, బీమా వంటి సామాజిక భద్రతా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా 55 ఏళ్లు పైబడిన కార్మికులకు రూ.3 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్ అందించడంతో పాటు నెలకు రూ.6 వేల పెన్షన్ మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులు,



డ్రైవర్లు, కంప్యూటర్ ఆపరేటర్లకు రాష్ట్ర ప్రభుత్వం గతంలో పెంచిన వేతనాలను తగ్గించే నిర్ణయం తీసుకోవడం సరికాదని విమర్శించారు. ఇప్పటికే చెల్లించిన పెరిగిన వేతనాలను తిరిగి వసూలు చేయాలనడం అన్యాయమని, కార్మికుల జీతాలు తగ్గిస్తే సీఐటీయూ ఆధ్వర్యంలో తీవ్ర ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఇల్లు, ఇంటి స్థలం లేని నిరుపేద ఉద్యోగులు, కార్మికులందరికీ ప్రభుత్వమే ఇంటి స్థలాలు కేటాయించి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలకు, పోడు భూములను సాగు చేస్తున్న ఆదివాసీ, గిరిజన రైతులకు భూ పట్టాలు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కాసల రాజలింగు, మహేందర్, తిరుపతి, దేవావరం, రమేష్ తదితర ఉద్యోగ, కార్మిక నాయకులు పాల్గొన్నారు.

# తెలంగాణ విద్యుత్‌కు సింగరేణి భరోసా-రాష్ట్ర అవసరాలకే తొలి ప్రాధాన్యం

### ప్రస్తుతం తెలంగాణ విద్యుత్ కేంద్రాలకు 72 శాతం బొగ్గు సరఫరా

### ఎల్‌నినో పరిస్థితులకు అనుగుణంగా మరింత బొగ్గు సరఫరాకు కార్యాచరణ

### సింగరేణి--జెన్‌కో సమన్వయ సమావేశంలో సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతి

మంచిర్యాల, 17, జూలై (ప్రజాజ్యోతి):రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని థర్మల్ విద్యుత్



కేంద్రాలకు తగినంత బొగ్గు సరఫరా చేస్తున్నామని, ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్ర అవసరాలకు మరింత ప్రాధాన్యం ఇస్తూ ఇంకా ఎక్కువ బొగ్గు రవాణా చేపట్టాలని సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతి అధికారులను ఆదేశించారు.సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతి, తెలంగాణ జెన్‌కో సీఎండీ డాక్టర్ హరీష్ ప్రస్తుత విద్యుత్ డిమాండ్, బొగ్గు ఉత్పత్తి, రవాణా తదితర అంశాలపై తమ శాఖల ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమన్వయ సమావేశం ను శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతి మాట్లాడుతూ, ప్రస్తుతం ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరిగినందున రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో తగినంత బొగ్గు నిల్వలు ఉండేలా సింగరేణి, జెన్‌కో అధికారులు మరింత సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నిరంతరాయ బొగ్గు రవాణా జరిగేలా ప్రత్యేక అధికారులను నియమించి పర్యవేక్షణను మరింత పటిష్ఠం చేస్తామని తెలిపారు. ప్రస్తుతం తెలంగాణలోని జెన్‌కో థర్మల్ విద్యుత్ కేంద్రాలు, రామగుండం ఎన్‌టీపీసీ, సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌లకు అవసరమైన బొగ్గులో 72 శాతం సింగరేణి నుంచే సరఫరా అవుతున్నట్లు సింగరేణి మార్కెటింగ్ విభాగం అధికారులు సీఎండీ దృష్టికి తీసుకువచ్చారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో తెలంగాణ ప్రయోజనాల దృష్ట్యా రాష్ట్ర విద్యుత్ కేంద్రాల అవసరాలకే తొలి ప్రాధాన్యం ఇవ్వాలని,




అవసరమైతే ఇతర రాష్ట్రాలకు సరఫరా చేసే బొగ్గు నుంచి సర్దుబాటు చేయాలని సీఎండీ స్పష్టం చేశారు. విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల అవసరాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ బొగ్గు ఉత్పత్తి, రవాణా, రైల్వే రేకుల లభ్యత, రోడ్డు రవాణా తదితర అంశాల్లో సింగరేణి, జెన్‌కో అధికారులు నిరంతరం సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వర్షాకాలంలో ఉపరితల గనుల్లో బొగ్గు ఉత్పత్తికి ఎలాంటి ఆటంకాలు కలగకుండా ఆయా ఏరియాల జనరల్ మేనేజర్లు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఉత్పత్తి తగ్గకుండా చూడాలని, బొగ్గు నాణ్యతలో ఎలాంటి రాజీ పడొద్దని అన్నారు . ఈ సందర్భంగా తెలంగాణ జెన్‌కో సీఎండీ డాక్టర్ హరీష్ మాట్లాడుతూ, జెన్‌కో థర్మల్ విద్యుత్ కేంద్రాల వద్ద ప్రస్తుతం ఉన్న బొగ్గు నిల్వల వివరాలను వెల్లడించారు. బొగ్గు రవాణాలో ఎదురవుతున్న సమస్యలను స్థానిక ఉన్నతాధికారులు చొరవ తీసుకుని వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో సింగరేణి డైరెక్టర్లు ఎల్వీ సూర్యనారాయణ, కె. వెంకటేశ్వర్లు, ఎం. తిరుమల రావు, ఈడీ (కోల్ మూవ్‌మెంట్) బి. వెంకన్న, జీఎం (కోఆర్డినేషన్, మార్కెటింగ్) టి. శ్రీనివాస్, జెన్‌కో డైరెక్టర్లు నాగ్య, రాజశేఖర్, సీతలు బిచ్చన్న, లక్ష్మయ్య, శ్రీప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

### ఆత్మీయ సమ్మేళనం సన్నాహక సమావేశం ఘనంగా నిర్వహణ -- 25 మంది సభ్యులతో ఆడ్‌హాక్ కమిటీ ఏర్పాటు

### పెన్షన్ పెంపు, వైద్య సదుపాయాల విస్తరణ, ఆసరా పెన్షన్, ఇందిరమ్మ ఇళ్లు, యూనియన్ బ్యాంకు పెన్షనర్లకు ప్రమాద బీమా కల్పించాలని వినతి

**మంచిర్యాల, 17, జులై (ప్రజాజ్యోతి):** సింగరేణి సంస్థ అభివృద్ధికి, లాభాల బాటలో నడిపించేందుకు దశాబ్దాల పాటు చెమటోడ్చి సేవలందించిన విశ్రాంత ఉద్యోగుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం అత్యవసరంగా పరిష్కరించాలని మంచిర్యాల జిల్లా సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంచిర్యాల జిల్లా సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆగస్టు నెలలో నిర్వహించనున్న “ఆత్మీయ సమ్మేళనం”కు సంబంధించిన సన్నాహక సమావేశం శుక్రవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. సమావేశానికి జిల్లా అధ్యక్షుడు గజ్జెల వెంకటయ్య, గౌరవ అధ్యక్షుడు రాళ్లబండి రాజన్న అధ్యక్షత వహించగా, జిల్లా ప్రధాన కార్యదర్శి పూదరి నర్సయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు ఎ. గంగన్న సమన్వయకర్తలుగా వ్యవహరించారు. ఈ సమావేశానికి బెల్లంపల్లి, మందమర్రి, రామకృష్ణాపూర్, మంచిర్యాల, సీసీసీ, శ్రీరాంపూర్ తదితర కోల్‌బెల్ట్ ప్రాంతాల నుంచి విశ్రాంత సింగరేణి ఉద్యోగులు, పెన్షనర్లు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఆత్మీయ సమ్మేళనాన్ని ఎలా నిర్వహించాలి, ఎవరెవరిని ఆహ్వానించాలి, కార్యక్రమ రూపకల్పన, నిర్వహణ కమిటీ తదితర అంశాలపై విస్తృతంగా చర్చించి పలు కీలక తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రస్తుతం విశ్రాంత సింగరేణి ఉద్యోగుల్లో చాలామంది 65 నుంచి 90 సంవత్సరాల వయస్సు కలిగి ఉన్నారని, వేలాది మంది నెలకు రూ.300 నుంచి రూ.1,000లోపు మాత్రమే బొగ్గు పెన్షన్ పొందుతూ తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస బొగ్గు పెన్షన్‌ను రూ.15 వేల వరకు పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా సీ.పీ.ఆర్.ఎం.ఎస్. ద్వారా మెడికల్ కార్డుపై అందిస్తున్న రూ.8 లక్షల వైద్య పరిమితిని రూ.25 లక్షలకు పెంచాలని, తక్కువ పెన్షన్ పొందుతున్న విశ్రాంత సింగరేణి ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆసరా పెన్షన్ వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు. అర్హత కలిగిన ఇల్లు లేని విశ్రాంత ఉద్యోగులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, లేదా సింగరేణి పరిధిలో మూతపడిన ఏరియాల్లో ఖాళీగా ఉన్న సింగరేణి క్వార్టర్లను కేటాయించి నివాస సౌకర్యం కల్పించాలని కోరారు. అలాగే ఎస్‌బీఐ బ్యాంకు ద్వారా నెలకు రూ.60 వేల నుంచి రూ.70 వేల లోపు పెన్షన్ పొందుతున్న విశ్రాంత ఉద్యోగులకు అమలులో ఉన్న రూ.30 లక్షల ప్రమాద బీమా సదుపాయాన్ని, యూనియన్ బ్యాంకు ద్వారా పెన్షన్ పొందుతున్న విశ్రాంత సింగరేణి ఉద్యోగులకు కూడా సమానంగా వర్తింపజేయాలని కేంద్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం, సంబంధిత బ్యాంకు అధికారులను డిమాండ్ చేశారు.



**25 మంది సభ్యులతో ఆడ్‌హాక్ కమిటీ ఏర్పాటు....**

ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు 25 మంది సభ్యులతో ఆడ్‌హాక్ కమిటీని ఏకగ్రీవంగా ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో గజ్జెల వెంకటయ్య (జిల్లా అధ్యక్షులు), రాళ్లబండి రాజన్న (గౌరవ అధ్యక్షులు), పూదరి నర్సయ్య (జిల్లా ప్రధాన కార్యదర్శి), ఎ. గంగన్న (జిల్లా ఉపాధ్యక్షులు), ఎం. అంజయ్య (శ్రీనివాస కాలనీ), సుంకరి రమేష్ (అమ్మ గార్డెన్స్), పోతురాల చంద్రయ్య, జెట్టి మురహరి (అమ్మ గార్డెన్స్), పేరాల రాజమల్లు (బెల్లంపల్లి), ఐలేని హనుమంతరావు (రామనగర్), దొంతుల సాయన్న (భరత్‌నగర్), అయ్లవేణి రామయ్య (అమ్మ గార్డెన్స్), చిందం మల్లేష్ (బృందావన్ కాలనీ), ఎం. లక్ష్మీనారాయణ (బాలాజీ టౌన్‌షిప్), కనుమ శంకర్ (నస్పూర్), జూకంటి సదయ్య, వెంకటరత్నం (భరత్‌నగర్), టి. నరసింహస్వామి (శ్రీరామ కాలనీ), కోల సత్తయ్య (కాలేజీ రోడ్), మంచకట్ల సత్యనారాయణ (బృందావన్ కాలనీ), కస్తూరి సూర్య (ఎం.జీ.ఆర్. టౌన్), మియాపురం వీరాచారి (గౌతమి నగర్), మంకు కొమరయ్య (ఆర్.కే.-6 కాలనీ), ఎం. కృష్ణమూర్తి (బెల్లంపల్లి), నల్లగొండ సదాశివ్ (సీసీసీ) సభ్యులుగా ఎంపికయ్యారు. జిల్లాలోని విశ్రాంత సింగరేణి ఉద్యోగులందరినీ ఒకే వేదికపైకి తీసుకురావడం, వారి మధ్య స్నేహబంధాలు, ఐక్యత, పరస్పర సహకారాన్ని బలోపేతం చేయడం ఆడ్‌హాక్ కమిటీ ప్రధాన లక్ష్యమని నాయకులు తెలిపారు. సమ్మేళనం తేదీ, వేదిక, పూర్తి కార్యక్రమ వివరాలను త్వరలో ప్రకటిస్తామని అన్నారు. జిల్లాలోని విశ్రాంత సింగరేణి ఉద్యోగులు, పెన్షనర్లు ఎవరైనా ఈ లి”ఆత్మీయ సమ్మేళనం”లిలో పాల్గొనవచ్చని, ఈ నెల 30వ తేదీలోగా తమ పేర్లను నమోదు చేసుకుని అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆడ్‌హాక్ కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సంఘం సలహాదారులు, సభ్యులు పెట్టం లక్ష్మణ్, గట్టు ప్రమోద్, ఈ. మహేంద్రరాజు, అయ్యోరి కిష్టయ్య, బి. కృష్ణ, చుంచు గురవయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశం ముగింపులో “జై సింగరేణి -- జై జై సింగరేణి”, “విశ్రాంత సింగరేణి ఉద్యోగుల సంఘం వర్ధిల్లాలి”, “విశ్రాంత ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి” అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు.

# కరుణించవా వరుణ దేవా!

### -అన్నదాతల అర్ధనాదం ఆవేదన ఆలకించవా!

### -కుంభవృష్టి కురిపించవా

### -వర్షాల కోసం వేదం విద్యార్థుల వేడుకోలు

**బోథ్, జూలై 17 (ప్రజా జ్యోతి)** వర్షాల కోసం కరుణించవా వరుణ దేవా అంటూ మండలంలోని స్థానిక వేదం పాఠశాల విద్యార్థులు రైతుల కష్టాలు, వ్యవసాయం ఎదురుకుంటున్న సవాళ్లను హృదయానికి హత్తుకునేలా పాట రూపంలో ఆవిష్కరించారు. వాన కోసం ఎదురుచూసే రైతుల కష్టాలు తీరాలని వర్షం పడాలని దేవుడికి ప్రార్థనలు చేసి వానలు కురవాలని పాటలు పాడి తమ సంఘీభావాన్ని తెలిపారు. ఇందులో భాగంగా విద్యార్థులు దేవతలను పూజించి నీరు పోసి వర్షాకాలం ప్రారంభమైనప్పటికీ ఆశించిన స్థాయిలో వర్షాలు కురవక రైతులు తీవ్రమైన ఆందోళన



చెందుతున్నారని విత్తనాలు వేసి చాలా రోజులవుతున్న మొలకలు ఎండిపోతున్నాయని రైతన్నలు ఆకాశం వైపు దీనంగా చూస్తున్నారని వర్షం కురిపించి రైతన్నల కష్టాలు తీరాలని కోరుతూ ఆలపించిన అభినయం అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పచ్చిపాల సంతోష్ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ను కలిసి న మోచి సంఘ రాష్ట్ర మా జీ ప్రధాన కార్యదర్శి బాల శంకర్ కృష్ణ



**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 17, (ప్రజా జ్యోతి)** తన పర్యటన సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి వచ్చిన తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను మోచి సంఘం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి బాల శంకర్ కృష్ణ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చైర్మన్ ను శాలువా తో సన్మానించి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ చిత్రపటాన్ని అందజే శారు. అనంతరం జిల్లాలోని దళిత సమస్యల పై వినతి పత్రం అందజేశారు. ఈ కార్య క్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఎస్సీ, ఎస్టీ కమి షన్ సభ్యులు కుస్రం నీలా దేవి, రాంబాబు నాయక్,కొంకటి లక్ష్మీనారాయణ, జిల్లా శంకర్, రేణిగుంట ప్రవీణ్, జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, జిల్లా అడిషనల్ కలెక్టర్లు రాజే శ్వర్, ఆర్. చిత్రు, దళిత సం ఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు గుంతలను పూడ్చిన ఆటో డ్రైవర్లు: ప్రయాణికులకు తప్పిన ఇబ్బందులు



**నేరడిగొండ, జులై 17 (ప్రజాజ్యోతి):**మండలంలోని కుప్టి బస్టాండ్ నుండి కుమారి గ్రామం వరకు వెళ్లే ప్రధాన రహదారి పట్ల అధికారులు నిర్లక్ష్యం వహించినా, స్థానిక ఆటో డ్రైవర్లు మాత్రం తమ ఉదారతను చాటుకున్నారు. గత కొంతకాలంగా ఈ రహదారిపై పలు చోట్ల పెద్ద పెద్ద గుంతలు ఏర్పడడంతో వాహన చోదకులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం ద్విచక్ర వాహనాలు, స్కూల్ బస్సులు, ఆటోలతో ఎంతో రద్దీగా ఉండే ఈ మార్గంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని గమనించిన స్థానిక ఆటో డ్రైవర్లు అన్వేష్, అత్రం శ్రీనివాస్, జె. కిరణ్, బి. సుశాంత్ ఒక మంచి నిర్ణయం తీసుకున్నారు. తమ సాటి ప్రయాణికుల ఇబ్బందులను చూడలేక, వారు స్థానికంగా దొరికే డాంబర్ మిశ్రమాన్ని తమ ఆటోల్లో స్వయంగా తీసుకువచ్చారు. రహదారిపై ప్రమాదకరంగా మారిన గుంతలన్నింటినీ వారు శ్రమదానంతో పూడ్చివేసి, ప్రయాణం సుగమంగా సాగేలా చేశారు. ఈ సందర్భంగా ఆటో చోదకులు మాట్లాడుతూ: “సుమారు రెండు కిలోమీటర్ల పొడవున్న ఈ రోడ్డు మొత్తం గుంతలమయంగా మారింది. ప్రయాణికులు, ముఖ్యంగా పాఠశాల పిల్లలు పడుతున్న ఇబ్బందులను చూసి చలించిపోయాం. అందుకే మా వంతు బాధ్యతగా, ఇకపై ఎవరికీ ఎలాంటి ప్రమాదాలు జరగకూడదనే మంచి ఉద్దేశంతో ఈ గుంతలను పూడ్చడం జరిగింది. ”అని తెలిపారు. ప్రభుత్వ అధికారులు స్పందించకపోయినా, ప్రజా క్షేమమే ధ్యేయంగా స్పందించి, శ్రమతో గుంతలను పూడ్చిన ఆటో డ్రైవర్ల మంచి మనసును, సామాజిక బాధ్యతను స్థానిక ప్రజలు, ప్రయాణికులు ముక్తకంఠంతో అభినందిస్తున్నారు.

## అంగన్వాడి-అమ్మ ఒడి



**బోథ్, జూలై 17 (ప్రజా జ్యోతి)** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "అమ్మ చేతి తొలి ముద్ద" కార్యక్రమాన్ని బోథ్ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని అంగన్‌వాడి కేంద్రం-8లో శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అంగన్వాడి కేంద్రం వారు తల్లిదండ్రులకు చిన్నారుల ఆరోగ్యం, పరిశుభ్రత, సమతుల్య ఆహారం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ పిల్లల ఎదుగుదలకు పౌష్టిక ఆహారం ఎంతో మేలు చేస్తుందని పేర్కొన్నారు. ఆరోగ్యకరమైన పిల్లలు దేశ సంపదని, భవిష్యత్ భారత్ కు బలమైన పునాది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, కట్ట భూమేష్, కార్వే శ్రీనివాస్, అంగన్‌వాడి టీచర్ ధనలక్ష్మి, ఏఎన్ఎమ్ శశికళ, ఆశా వర్కర్, తల్లులు, చిన్నారులు స్థానికులు పాల్గొన్నారు.

## సర్ సర్వే సక్సెస్ కు కాంగ్రెస్ కార్యకర్తలు కృషి చేయాలి

**ఖానాపూర్,పెంబి, మండలాల బిఎల్ఏ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే బొజ్జు పటేల్**



**ఖానాపూర్ జూలై 17 (ప్రజా జ్యోతి )** జాతీయ ఎన్నికల కమిషన్ నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ సర్ సర్వే సక్సెస్ కు కాంగ్రెస్ బిఎల్ఏ టులతోపాటు కార్యకర్తలు కృషి చేయాలని ఒక్క ఓటు తప్పిపోకుండా కాపాడాల్సిన బాధ్యత కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల భుజస్కందాలపై ఉందని నిర్మల్ జిల్లా డిసిసి అధ్యక్షులు ఖానాపూర్ శాసనసభ్యులు వెడమ బొజ్జు పటేల్ అన్నారు శుక్రవారం ఖానాపూర్,పెంబి మండలాలకు చెందిన బిఎల్ఏ2 ముఖ్య కార్యకర్తల సమీక్ష సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు పెంబి మండలంలోని గిరిజన గ్రామాలైన వసుపల్లి,దొందరి, గోండుగూడాలతో తోపాటు అడవి సారంగాపూర్ లో 100 శాతం సర్వే పూర్తి కావడం అభినందనీయం అన్నారు పట్టణాల్లో ఇంకా పూర్తిస్థాయిలో పాల్గొనాల్సిన అవసరం ఉందని తెలిపారు నియోజకవర్గంలోని 308 పోలింగ్ బూతుల్లో సక్సెస్ చేసి రానున్న రోజుల్లో అసలైన ఓటర్లకు ఇబ్బంది కలగకుండా ఓటు కల్పించాల్సిన బాధ్యత తమపై ఉందని గుర్తు చేశారు 2002లో ఓటర్ లిస్టు ప్రమాణికంగా కొత్తగా వచ్చిన కుటుంబ సభ్యుల భార్యలైతేనేని కోడలు అయితేనేమి వారి స్వస్థలంలో గల తల్లిదండ్రుల కుటుంబ సభ్యుల ఓటు ఆధారంగా ఎక్కడి నుంచి వచ్చారో తెలుసుకోవడం జరుగుతుందన్నారు ఎమ్మెల్యే బొజ్జుతోపాటు డిసిసి ఉపాధ్యక్షులు రాజు ర సత్యం అధికార ప్రతినిధి దొనకని దయానంద్ కార్యదర్శి స్వప్నల్ రెడ్డి ఆత్మ కమిటీ చైర్మన్ తోట సత్యం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మాజీద్ పిఏసిఎస్ చైర్మన్లు శ్రీనివాసరెడ్డి అమద శ్రీనివాస్ మాజీ మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్ జన్నారం శంకర్ జమాల్ కురిసి సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు రాజు నాయక్ కడార్ల గంగా నరసయ్య ఖానాపూర్ పెంబి మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జంగిల్ శంకర్ గుడిసె రమేష్ పట్టణ అధ్యక్షులు గౌరె గంగాధర్ రెండు మండలాల ముఖ్య కార్యకర్తలు బి ఎల్ ఏ టూలు తదితరులు పాల్గొన్నారు

# నకిలీ పత్రాలు సృష్టించి స్థలం కబ్జా చేసిన కేసులో తండ్రి కొడుకులపై కేసు నమోదు

**కొడుకు అరెస్టు, తండ్రి పరారీ ఆదిలాబాద్ వన్ టౌన్ ఇన్స్పెక్టర్ బి సునీల్ కుమార్**

**నకిలీ పత్రాలు సృష్టించి బ్యాంకును సైతం మోసం చేసిన నిందితులు**

**నకిలీ పత్రాలను సృష్టించడానికి సహకరించిన వారిపై దర్యాప్తు**





**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 17, (ప్రజా జ్యోతి)**నకిలీ పత్రాలు సృష్టించి స్థలం కబ్జా చేసిన కేసులో తం డ్రి కొడుకుల పై కేసు నమోదు చేసినట్లు ఆదిలాబాద్ వన్ టౌన్ సిఐ సునీల్ కుమార్ తెలిపారు. ఎ1) రంగినేని శ్రీ నివాస్(40) సూర్య ప్రకాష్, శాంతి నగర్ ఆదిలా బాద్, ఎ2) రంగినేని సూర్య ప్రకాష్ బాల కిషన్‌ల పై ఈ కేసు నమోదు చేసిన ట్లు పేర్కొన్నారు.శాంతినగర్ ఆదిలాబాద్ లో 1979 సంవత్సరంలో ఆదిలాబాద్ పట్టణానికి చెందిన గృహిణి సుష్మ బేల ధరమ్ చంద్ చౌదరి అనే మహిళ శాంతినగర్ లో బొక్కల్ గూడనం 1లో గల ప్లాట్ నెంబర్ 4 సిక్లాస్ ప్రాంతంలో ఆదిలాబాద్ పట్టణానికి చెందిన గాదె నారాయణ వద్ద స్థలాన్ని కొనుగోలు చేసింది. ఈ స్థలానికి మున్సిపాలిటీ కార్యాలయం ద్వారా ప్రొ సీడింగ్స్, మ్యుటేషన్, డోర్ నెంబర్ కేటాయించబడ్డాయి. ఈ స్థలాన్ని 2016 సంవత్సరంలో నిందితుడు రంగినేనిసూ ర్య ప్రకాష్ కు మూడు సంవ త్సరాల వ్యవధికి లీజుకు అప్పజెప్పింది. 2019 సంవ త్సరంలో లీజు పూర్తయిన తర్వాత తిరిగి స్థలాన్ని అ ప్పగించవలసి ఉంటుంది. ఈ ఒప్పందం ప్రకారం మున్సిపాలిటీ అనుమతితో తాత్కాలిక నివాసాన్ని మాత్రమే ఏర్పరచవలసి ఉంటుంది. కానీ నిందితుడు ఎటువంటి మున్సిపాలిటీ అను మతులు లేకుండా అక్రమంగా ఇల్లును నిర్మించి, ఆస్థలాన్ని ఎలాగైనా ఆక్రమించాలనే దురుద్దేశంతో, దానికి 1983 సంవత్సరానికి చెందిన మున్సిపల్ చైర్మన్ లక్ష్మ ణరావు పేరుపై, మున్సిపాలిటీ కౌన్సిల్ జారీ చేసినట్లుగా, చైర్మన్, కౌన్సిలర్ల నకిలీ సంతకాలు నకిలీ స్టాంపులతో నకిలీ ప్రొసీడింగ్ పత్రాల ను సృష్టించి, దానికి నకిలీ పట్టా సర్టిఫికెట్‌ను సృష్టించారు. దీనికి 2009లో నకిలీ మున్సిపాలిటీ పర్మిషన్ పత్రాలను సృష్టించి, ఈ పట్టా సర్టిఫికెట్ సహాయంతో రంగనేని సూర్యప్రకాష్ పేరు పై ఉన్న భూమిని గిఫ్ట్ డీడ్ ద్వారా రంగనేని శ్రీనివాస్ పేరుపై 2023 సంవత్సరం లో మార్చుకున్నారు వెంటనే ఈ నకిలీ పత్రాలను ఉప యోగించి ఎస్బిఐ సిసిఐ బ్రాంచ్ బ్యాంక్ ద్వారా సోలార్ బిజినెస్ చేస్తామని 49 లక్షలలోను తీసుకు న్నారు. దీనికి సంబంధించిన కిస్తీలు చెల్లించని పక్షంలో ఎస్బిఐ బ్యాంకు వారు గత వారం రోజుల క్రితం పేపర్‌లో ఎన్ పి ఎ చేస్తా మని ప్రకటన చేయడంతో బాధితులు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐ పిఎస్ ని సంప్రదించి న్యాయం చేయవలసిందిగా కోరడం జరిగిందని ఆదిలాబాద్ వన్ టౌన్ ఇన్స్పెక్టర్ బి సు నీల్ కుమార్ తెలిపారు.ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ నకిలీ పత్రాలు సృష్టించిన నిందితులను గురువారం అరెస్టు చేయడం జరిగిందని, వారిని న్యాయస్థానం ముందు ప్రవేశ పెట్టడం జరిగిందని తెలిపారు. నకిలీ పత్రాలను సృష్టించడంలో సహాయపడ్డ నిందితులపై దర్యాప్తు కొనసాగుతుందని ఈ దర్యాప్తునందు పాలు పంచుకున్న నిందితులు ఎవరైనా వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

# మారుతిగూడ గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం

**గుడుంబా తయారీ స్థావరాలపై దాడులు -- 1 లీటర్ గుడుంబా, తయారీ సామగ్రి స్వాధీనం**

**40 వాహనాలు స్వాధీనం -- మహువా పూల పులిసిన ద్రావణాన్ని ధ్వంసం చేసిన పోలీసులు**

**ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి**





**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 17, (ప్రజా జ్యోతి)** బేలా మండలంలోని మారు తిగూడ గ్రామంలో గురువారం తెల్లవారుజామున ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి ఆధ్వర్యంలో కమ్యూని టీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో విస్తృతంగా తనిఖీలు చేపట్టి శాంతిభద్రతల పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా గుడుంబా తయారీ పై ప్రత్యేక దృష్టి సారించిన పోలీసులు 1 లీటర్ గుడుం బాను, గుడుంబా తయారీకి వినియోగిస్తున్న పాత్రలు, సామగ్రిని ధ్వంసం చేశారు. అలాగే గుడుంబా తయారీ కోసం నిల్వ ఉంచిన మహు వాపూల పులిసిన ద్రావణా న్ని అక్కడికక్కడే ధ్వంసం చేశారు. గ్రామంలో వాహనా లపై ప్రత్యేక తనిఖీలు నిర్వ హించి పలు నిబంధనలు ఉల్లంఘించిన 40 వాహనా లను స్వాధీనం చేసుకున్నారు. చట్టవిరుద్ధ కార్యకలాపా లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని, గుడుంబా తయారీ, విక్ర యాలపై నిరంతర నిఘా కొనసాగిస్తామని డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి తెలిపారు. గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలతో సత్సంబంధాలు పెంపొందించేందుకు కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తామని అన్నారు. గ్రామంలో సిసిటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అసంఘి కకార్యకలాపాలు జరగకుండా పటిష్టమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జైనథ్ సిఐ జి. శ్రావణ్ కుమార్, ఎస్ఐలు మధు కృష్ణ, గౌతమ్, పీర్ సింగ్ నాయక్, పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ గిరిజనుల ఆధ్యాత్మిక విశ్వాసానికి ప్రతీక నాగోబా దేవాలయం

### తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య
### కేస్లాపూర్ నాగోబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన చైర్మన్, సభ్యులు





**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 17, (ప్రజా జ్యోతి)** నాగోబా దేవాలయం తెలంగాణ గిరిజనుల ఆధ్యాత్మిక విశ్వాసానికి ఒక ప్రత్యేకగా నిలిచిందని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. శుక్రవారం ఉదయం ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ గ్రామంలోని గిరిజనుల ఆరాధ్య దైవం శ్రీ నాగోబా దేవాలయాన్ని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, కమిషన్ సభ్యులతో కలిసి భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి, నాగోబా దేవుని ఆశీస్సులు అందించారు. ఈ సందర్భంగా మెస్రం వంశీయులతో ఆత్మీయంగా సమావేశమైన కమిషన్ చైర్మన్ నాగోబా దేవాలయ చరిత్ర, మెస్రం వంశీయుల సంప్రదాయాలు, నాగోబా జాతర విశిష్టత, గిరిజనుల ఆచార వ్యవహారాల గురించి వివరంగా తెలుసుకున్నారు. మెస్రం పెద్దలు నాగోబా దేవత ఆవిర్భావం, జాతర నిర్వహణ విధానం, తరత రాలుగా కొనసాగుతున్న సంప్రదాయాలు, గిరిజనుల సామాజిక, సాంస్కృతిక జీ వన విధానంపై సమగ్రంగా వివరించారు. ఈ సందర్భంగా బక్కి వెంకటయ్య మాట్లా డుతూ నాగోబా దేవాలయం తెలంగాణ గిరిజనుల ఆధ్యాత్మిక విశ్వాసానికి ప్రతీ కగా నిలిచిందన్నారు. నాగో బాజాతర దేశవ్యాప్తంగా గిరిజన సంస్కృతికి ప్రతిబింబమని, గిరిజనుల చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు ప్రపంచానికి ఆదర్శంగా నిలిచే గొప్ప వార సత్వమని పేర్కొన్నారు. గిరిజన సమాజం తమ మూలాలను, సంస్కృతిని, సంప్రదాయాలను పరిరక్షించుకుంటూ భావిత రాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. గిరిజనుల సంస్కృతి, ఆచారాలు, సంప్రదాయాలు భారతీయ సంస్కృతిలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించాయని, నాగోబా వంటి ఆ ధ్యాత్మిక కేంద్రాలు గిరిజనుల ఐక్యతకు, సంస్కృతి పరి రక్షణకు నిదర్శనంగా నిలు స్తున్నాయని తెలిపారు. గిరిజనుల ఆధ్యాత్మిక విశ్వాసాలను, వారి సాంస్కృతిక వారసత్వాన్ని ప్రభుత్వం పరిర క్షించేందుకు కట్టుబడి ఉందని పేర్కొన్నారు. అనంతరం కమిషన్ సభ్యులు ఆలయ పరిసరాలను పరిశీలించి, దేవాలయ విశిష్టత, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాల గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. నాగోబా దేవాలయం, జాతర నిర్వహణకు సంబంధించిన పలు అంశాలపై స్థానిక పెద్దలతో అభిప్రాయాలు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్సీ కమిషన్ సభ్యులుకు ప్రంసీలాదేవి, మెస్రం వంశీయుల పెద్దలు, ఆలయ అర్చకులు, స్థానిక ప్రజా ప్రతి నిధులు, గిరిజన నాయకులు, అధికారులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# 15 ఏళ్ల తర్వాత ఈఎస్ఐలో స్టాఫ్ నర్సుల నియామకాలు




**247 మంది స్టాఫ్ నర్సులకు నియామక పత్రాలు అందజేసిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, కార్మిక, గనుల శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి**



**మంచిర్యాల, 17, జూలై (ప్రజాజ్యోతి):** హైదరాబాద్ లోని కొమరం భీమ్ ఆదివాసీ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, కార్మిక, గనుల శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి కలిసి కొత్తగా నియమితులైన 247 మంది ఈఎస్ఐ స్టాఫ్ నర్సులకు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ, 15 సంవత్సరాల తర్వాత ఈఎస్ఐలో స్టాఫ్ నర్సుల నియామకాలు చేపట్టడం చారిత్రాత్మక ఘట్టమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మొత్తం 599 పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టిందని, త్వరలోనే మరో 313 మంది వైద్య, పారామెడికల్ సిబ్బందిని నియమించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని ఈఎస్ఐ ఆస్పత్రుల్లో సిబ్బంది కొరతను పూర్తిగా తొలగించి, కార్మికులకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. ప్రస్తుతం ఈఎస్ఐ ద్వారా 20 లక్షల మంది కార్మికులు, సుమారు 75 లక్షల మంది లబ్ధిదారులకు వైద్య సేవలు అందుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో వైద్య సేవలను మరింత విస్తరించే దిశగా రామగుండం, శంషాబాద్, కొత్తగూడెంలో కొత్త ఈఎస్ఐ ఆస్పత్రులు ఏర్పాటు చేయనున్నట్లు, అలాగే మహబూబ్ నగర్‌లో 30 పడకల ఈఎస్ఐ ఆస్పత్రిని నిర్మించనున్నట్లు మంత్రి వెల్లడించారు. అదేవిధంగా నాచారంలో ఈఎస్ఐ నర్సింగ్ కళాశాల ను కూడా త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈఎస్ఐ ఆస్పత్రుల నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించేం దుకు పెండింగ్ బిల్లుల చెల్లింపుల కోసం రూ. 72 కోట్లు విడుదల చేసినట్లు మంత్రి అన్నారు. కొత్తగా నియమితులైన నర్సులను ఉద్దేశించి మాట్లాడుతూ, "ఉద్యోగంగా కాకుండా సేవగా భావించి బాధ్యతతో పనిచేయాలి. కార్మికుల ఆరోగ్యమే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యం" అని సూచించారు. దేశంలోనే అత్యుత్తమ కార్మిక ఆరోగ్య సేవల వ్యవస్థగా ఈఎస్ఐని తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, వైద్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

## సర్ ప్రక్రియను వేగవంతం చేయాలి

**కూచాడి శ్రీహరి రావు**




**లక్ష్మణ చాంద, జూలై 17 (ప్రజా జ్యోతి)** సర్ ప్రక్రియను వేగవంతం చేయాలని నిర్మల్ జిల్లా నియోజక వర్గం ఇన్చార్జ్ కూచాడి శ్రీహరి రావు అన్నారు. శుక్రవారం రోజున కనకాపూర్, వడ్యాల్, రాచాపూర్, లక్ష్మణ చాంద, మునిపల్లి గ్రామాలను సందర్శించి ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్) ప్రక్రియను సమీక్షించారు. అర్హత ఉన్న ఓటరుకు అవకాశం కల్పించేలా సమన్వయంతో పనిచేయాలని బి ఎల్ ఓ, బిఎల్ఏ లకు సూచించారు. వడ్యాల్ గ్రామంలో సర్ ప్రక్రియ 100% పూర్తి అయిన సందర్భంలో బిఎల్ఓ, బిఎల్ ఏ లను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ మార్కెట్ కమిటీ అధ్యక్షులు సోమ్ భీమ్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోండ్ర నరేష్ రెడ్డి, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు ఈటల శ్రీనివాస్, గ్రామ సర్పంచులు సంఘని రాజు, పసుపుల నరేష్, బూసి మహేష్, ఓడ్నాల వెంకట్, కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు ఓడ్నాల రాజేశ్వర్, నాయకులు ప్రతాపరెడ్డి, గురాల లింగారెడ్డి,మాజీ సర్పంచులు గంగాధర్ గౌడ్, తునికి నారాయణ, శాతం గంగారాం, మేకల రాజేందర్, ఉప సర్పంచులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నూతన కార్యవర్గం ఎన్నిక



**బోథ్, జూలై 17 (ప్రజా జ్యోతి)** బోథ్ ఇచ్చోడ మండలాల అగ్రి ఎంప్లాయిస్ సీడ్స్ అండ్ పెస్టిసైడ్ నూతన కార్యవర్గం ఎన్నికైనట్లుగా సంఘం సభ్యులు తెలిపారు. నూతన గౌరవ అధ్యక్షులు గా ముండే సురేష్, ఉపాధ్యక్షుడిగా లక్ష్మారెడ్డి కార్యదర్శి గా జితేందర్ రెడ్డి ప్రధానకార్యదర్శి గా మునిగేలా రమేష్ కోశాధికారిగా అశోక్ సలహాదారులు గా రాజేశ్వర్, అరుణ్, గోపి, హరినాథ్ చారి లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## రాష్ట్రస్థాయి అండర్ 19 క్రికెట్ మైదానంలో సోనాల యువకిశోరాలు



**సోనాల, జూలై 17 ( ప్రజాజ్యోతి ):** సోనాల మండల కేంద్రానికి చెందిన ఆర్ ఎన్ కె క్రికెట్ అకాడమీ నుండి ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో శుక్రవారం జరిగిన అండర్ 19 క్రీడాకారుల ఎంపికలో సోనాల మండలానికి చెందిన రామాయి మహేష్, భూషెట్టి సాయి, కార్తీక్, సాయి చరణ్, బుర్ర రాహుల్, మాకునూరి సిద్ధు, సోలంకి రామ్, సోలంకి సాయి కృష్ణ, ఎంపిక కావడం జరిగింది. వీరంతా వచ్చే నెలలో జరగనున్న రాష్ట్రస్థాయి అండర్ 19 క్రీడా పోటీలలో పాల్గొంటారని ఉమ్మడి జిల్లా కార్యదర్శి నరోత్తం రెడ్డి తెలిపారు. ఎంపిక కమిటీలో రామరాజు, హర్ష, సాయికిరణ్ లు ఉన్నారు. వీరి ఎంపిక పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

# రెబ్బెన పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన హత్య కేసును ఛేదించిన పోలీసులు

**ఇద్దరు నిందితుల అరెస్ట్, రిమాండ్ కు తరలింపు**

**రెబ్బెన సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం సంజయ్:**



**జులై17,సిర్పూర్(టి) నియోజకవర్గ కరస్పాండెంట్ ప్రజాజ్యోతి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన పోలీస్ స్టేషన్ పరిధిలో నారాయణపూర్ గ్రామ శివారులో జరిగిన వేమునూరి స్వామి హత్య కేసును పోలీసులు వేగంగా ఛేదించి నిందితులను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు పంపించారు.రెబ్బెన సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం.సంజయ్ తెలిపిన వివరాల ప్రకారం.ఈనెల 15 తేదీ రోజున తన భర్తను హత్య చేశారని ఫిర్యాదు రావడంతో వేమునూరి దేవల ఫిర్యాదు మేరకు రెబ్బన ఎస్సై వెంకటకృష్ణ ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. మృతుడు వేమునూరి స్వామి బంధువైన వైష్ణవి అనే యువతి కుటుంబ అనుమతి లేకుండా ఇంటి నుండి వెళ్లిపోవడం వల్ల కుటుంబ సభ్యుల మధ్య తీవ్ర మనస్తాపం నెలకొంది. ఈ ఘటనకు వేమునూరి స్వామే కారణమని భావించిన ఇస్గం మండలం రాసపల్లి గ్రామానికి చెందిన ఇరుగురాల వెంకటేష్ మరియు అతని అన్న ఇరుగురాల తిరుపతి ప్రతీకార భావంతో అతనిని హత్య చేయాలని పథకం రచించారు.ఈ క్రమంలో 14-07-2026 రాత్రి 11.50 నారాయణపూర్ గ్రామానికి వెళ్లి, వేమునూరి స్వామిని ఇంటి బయటకు పిలిచి మోటార్ సైకిల్‌పై గ్రామ శివారుకు తీసుకెళ్లారు. అక్కడ ఇద్దరూ కలిసి కత్తితో విచక్షణార హితంగా దాడి చేసి హత్య చేశారు. అనంతరం నేరానికి ఉపయోగించిన కత్తిని సంఘటన స్థలం సమీపంలో పడవేసి, రక్తపు మరకలతో ఉన్న దుస్తులు మరియు మొబైల్ ఫోన్లను ఆధారాలు నశింపజేయాలనే ఉద్దేశంతో వాగులో పడవే శారు. సంఘటన అనంతరం పరారయ్యారు. పరారీలో ఉన్న నిందితులు తేదీ 17.07. 2026 కాగజ్‌నగర్ క్రాస్ రోడ్ వద్ద పోలీసులు నిర్వహిస్తున్న వాహనాల తనిఖీలో అనుమానాస్పదంగా కనిపించారు. పోలీసులు వారిని ఆపేందుకు ప్రయత్నించగా తప్పించుకు నేందుకు యత్నించినప్పటికీ వెంబడించి అదుపులోకి తీసుకున్నారు. విచారణ లో నిందితులు హత్యకు ఉపయోగించిన బజాజ్ పల్సర్ మోటార్ సైకిల్ రక్తపు మరకలతో ఉన్న దుస్తులు మరియు కేసుకు సంబంధించిన ఇతర ఆధారాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.వాహనం పై లభించిన రక్తపు మరకలను క్లూస్ బృందం సేకరించింది. నిందితులు చూపించిన ప్రదేశం నుండి నేరానికి ఉపయోగించిన కత్తిని కూడా స్వాధీనం చేసుకున్నారు. రెబ్బెన సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం సంజయ్ దర్యాప్తు చేసి, వేము నూరి స్వామి హత్యకు కారకులైన ఇరుగురాల వెంకటేష్ మరియు తిరుపతి లను ఈరోజు రెబ్బెన పోలీసులు అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

# పదేళ్లు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ నాయకులు



**ఏం చేయకుండా నన్ను ప్రశ్నిస్తే ఎలా**

**అభివృద్ధి నిరోధకులు ఈ ప్రాంత లోకల్ నాయకులే**

**నేనెవరికీ భయపడను కార్యకర్తలని కంటికి రెప్పల కాపాడుకుంటాం**

**ఖానాపూర్ లో ఆయిల్ ఫాం ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తా**

**ఎమ్మెల్యే బొజ్జు పటేల్ వెల్లడి**

**ఖానాపూర్ జూలై 17( ప్రజా జ్యోతి )** పదేళ్లు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీ నాయకులు నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి చేయకుండా తనను ప్రశ్నిస్తే ఎలానని ఈ ప్రాంత అభివృద్ధి నిరోధకులు లోకల్ నాయకులేనని కెసిఆర్ పాలనలో అదే సామాజిక వర్గానికి చెందిన వాళ్లే ఇక్కడ డామినేట్ చేసి అభివృద్ధికి ఆటంకంగా మారారని నిర్మల్ జిల్లా డిసిసి అధ్యక్షులు ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ బొజ్జపటేల్ ఘాటుగా విమర్శించారు ఖానాపూర్ పట్టణంలోని జెకె ఫంక్షన్ హాల్లో జరిగిన ఖానాపూర్ పెంబి మండలాలకు చెందిన సమావేశంలో పాల్గొన్న సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలని కుటుంబ సభ్యులల కంటికి రెప్పలా కాపాడుకుంటానని ఏదైనా కార్యకర్తలకు హాని చేస్తే నన్ను టచ్ చేసి కార్యకర్తల వద్దకు వెళ్లాలని అన్నారు తాను ఎవరికి భయపడనని అనవసరంగా ప్రతిపక్షాలు ప్రత్యక్షంగా ఎదురుకోక రెచ్చగొట్టి కొంతమంది అధికారులతో కుమ్మక్కై నన్ను అభాసు పాలు చేయాలని చూస్తున్నా వారిపట్ల ఎలాంటి చర్యలు తీసుకోవాలో తెలుసన్నారు కాంగ్రెస్ పార్టీలో సీనియర్ జూనియర్ పాత కొత్తల తేడా లేకుండా పనిచేసిన వారందరికీ సమచితస్థానం కల్పిస్తామని అన్నారు నామినేట్ పదవుల్లో సముచిత న్యాయం చేస్తా మని పదుల సంఖ్యలో ఉన్న కార్యకర్తలు వందలు వేలుగా మారి పార్టీకి కృషి చేస్తున్న వారిపట్ల దృష్టి సారించామని అందరికీ పదవులు రావన్న విషయాన్ని గమనించాలని సామాజిక వర్గాల వారీగా పదవులు ఇవ్వడం జరుగుతుందన్నారు కార్యకర్తలు కోరిక మేరకు ఇందిరమ్మ ఇండ్లు అందరికీ అచ్చే విధంగా ఇందిరమ్మ కమిటీల ద్వారానే మంజూరు చేస్తామన్నారు ప్రచారంలో సోషల్ మీడియాలో ప్రతిపక్ష దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాలి రెండున్నర సంవత్సరాల్లో అభివృద్ధి చేసిన పనులతో పాటు ప్రతిపక్ష పార్టీలు ఉన్నది లేనట్టు లేనిది ఉన్నట్టుగా చిత్రీకరిస్తున్న సోషల్ మీడియా దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాల్సిన బాధ్యత ప్రతి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తపై ఉందని ఎమ్మెల్యే అన్నారు రానున్న రోజుల్లో ఖానాపూర్ ప్రాంతఅభివృద్ధికి కట్టుబడి అందులో భాగంగా ఆయిల్ ఫాం ఫ్యాక్టరీని త్వరలో ఇక్కడ నెలకొల్పుతామని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో ఖానాపూర్ పెంబి ప్రజా ప్రతినిధులు నాయకులు బిఎల్ఏలు పార్టీ కార్యకర్తలు సర్పంచులు తదితరులు పాల్గొన్నారు

# ఆగస్టు 31లోగా సీసీఐ పున రుద్ధరణపై స్పష్టత లేకపోతే ఆమరణ నిరాహార దీక్ష

**మాజీమంత్రి జోగు రామన్న**



**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 17, (ప్రజా జ్యోతి)** ఆగస్టు 31లోగా ఆదిలాబా ద్ సీసీఐ పరిశ్రమ పునరుద్ధ రణపై కేంద్ర ప్రభుత్వం స్పష్ట మైన ప్రకటన చేయకపోతే ఆమరణ నిరాహార దీక్షకు ది గుతానని మాజీమంత్రి, బీ ఆర్ ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్నప్రకటించారు. సీసీఐ పునఃప్రారంభం కోసం అవసరమైతే ప్రాణాలను సై తం లెక్కచేయబోననిస్పష్టం చేశారు.శుక్రవారం స్థానిక బీఆర్ఎస్ పార్టీ కార్యాల యంలో నిర్వహించిన మీడి యా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సీసీఐ అం శంపై ఎమ్మెల్యే పాయల్ శం కర్ చేసిన వ్యాఖ్యలను తీ వ్రంగా ఖండించారు. పక్క రాష్ట్రంలోని స్టీల్ ప్లాంట్‌కు కేంద్ర ప్రభుత్వం అన్ని అను మతులు ఇస్తుండగా, ఆది లాబాద్ ప్రజలు బీజేపీ ఎం పీ, ఎమ్మెల్యేలను గెలిపించి నప్పటికీ సీసీఐ పరిశ్రమను పునరుద్ధరించకుండా విక్ర యించే ప్రయత్నాలు చేయ డం బాధాకరమని అన్నారు. 2017లో ఎన్నికల సమ యంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆదిలాబాద్ ప్రజలకు సీసీఐ పునరుద్ధర ణపై హామీ ఇచ్చి ఇప్పటి వ రకు అమలు చేయలేదని వి మర్శించారు. సీసీఐ పునరు ద్ధరణపై కేంద్ర ప్రభుత్వం ఎ లాంటి ప్రకటన చేయకపోవ డమే కాకుండా, స్థానిక ఎం పీ, ఎమ్మెల్యేలు కూడా కనీస చిత్తశుద్ధి చూపడం లేదనిఆ రోపించారు. సీసీఐలో చట్ట విరుద్ధంగా స్క్రాప్ టెండర్లు పిలిచారని, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వాటి ని అడ్డుకునేందుకు కోర్టును ఆశ్రయించిన విషయాన్ని గు ర్తు చేశారు. స్థానిక ఎమ్మెల్యే కు కమిషన్లు వచ్చే పనుల పైనే దృష్టి ఉందని,ఐదువేల మంది యువతకు ప్రతి సం వత్సరం ఉద్యోగాలు కల్పి స్తామని ఇచ్చిన హామీ ఏ మైందని ప్రశ్నించారు.సీసీఐ సాధన సమితి పరిశ్రమ పు నః ప్రారంభం కోసం నిరంత రం ఉద్యమాలు నిర్వహి స్తుంటే, స్థానిక బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యే ప్రజల ముందుకు రావడం లేదని విమర్శించా రు. కేంద్రంలోని బీజేపీ నా యకులు అమిత్ షా, నితిన్ గడ్కరీ, హంసరాజ్ గంగా రాం, అనంత్ గీతే తదితరు లు గతంలో సీసీఐ పునరు ద్ధరణపై హామీలు ఇచ్చి అ మలు చేయకపోవడం ఆది లాబాద్ ప్రజలను, యువ తను మోసం చేసినట్లేనని అన్నారు.కేసీఆర్, కేటీఆర్ నాయకత్వంలోని గత బీ ఆర్ ఎస్ ప్రభుత్వం టీ ఎస్ పీ ఎస్ నిధులతో సీసీఐ పరి శ్రమను పునః ప్రారంభిం చేం దుకు కేంద్ర సహకారం కోరి నా స్పందన రాలేదని తెలి పారు. కేంద్రంలోని బీజేపీ ప్ర భుత్వం, స్థానిక ఎంపీ, ఎ మ్మెల్యేలు ఆదిలాబాద్ అభి వృద్ధిలో భాగస్వామ్యం కావ డం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి ప ర్యటన సమయంలో భూ ముల అంశాలపై చూపుతు న్న ఆసక్తిని సీసీఐ పునరుద్ధ రణపై కూడా చూపాలని ఎ మ్మెల్యేకు జోగు రామన్న సూచించారు. ఆగస్టు నెలా ఖరులోగా సీసీఐ పునరుద్ధ రణపై స్పష్టత రాకపోతే సీసీ ఐ సాధన సమితి ఆధ్వర్యం లో ఆమరణ నిరాహార దీక్ష తో పాటు ఉధృత నిరసన కార్యక్రమాలు చేపడతామ ని హెచ్చరించారు. ఈ మీడి యా సమావేశంలో పట్టణ అధ్యక్షుడు అజయ్, విజ్జగిరి నారాయణ, సాజితోద్దీన్, రాజన్న, బట్టు సతీష్,దాసరి రమేష్, పరమేశ్వర్, సురేం దర్, ఆసిఫ్, అశోక్, అనిల్, దయానంద్ తదితరులు పా ల్గొన్నారు.

## తలమడుగు మండలంలో రూ. 50 లక్షల అభివృద్ధి పనులకు భూమిపూజ

మాజీ ఎంపీ, స్థానిక నేతల తో కలిసి శంకుస్థాపన చేసి న ఏఎంసీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి



**తలమడుగు, జూలై 17, (ప్రజా జ్యోతి)** ఆదిలాబాద్ జిల్లా తల మడుగు మండలంలోని పలు ఆదివాసీ గ్రామా ల్లో మాజీ ఎంపీ సోయం బాపూరావు మంజూరు చేయించిన మొత్తం రూ. 50 లక్షల ఎన్ ఆర్ ఈ జీ ఎస్ నిధుల తో చేపట్ట నున్న అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. మాజీ ఎంపీ సోయం బాపూరావు తో కలిసి ఆదిలాబాద్ వ్య వసాయ మార్కెట్ కమిటీ చై ర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, మాజీ డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మాజీ జెడ్పీటీ సీ లు గోక గణేష్ రెడ్డి, బొల్లారం బాబన్న లు శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ ని ధులతో మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టను న్నారు. ఇందులో భాగంగా కొత్త నందిగామకు రూ. 10 లక్షలు, చిన్న మందగూడకు రూ. 10 లక్షలు, ఝరి షేక్ గూడకు రూ. 10 లక్షలు వెచ్చించనున్నారు. అలాగే పూన గూడ లో రూ. 5 లక్షలు, కోసాయిలో రూ. 5 లక్షలు, రత్నాపూర్‌లో రూ. 5 లక్షల నిధులతో ఈ పనులను చేపట్ట ను న్నారు. ఇదిలా ఉంటే తల మడుగు మండలం టెకుగూ డలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నూతనంగా నిర్మించి ఇచ్చిన ఇందిరమ్మ ఇళ్లను ప్రారం భించి, లబ్దిదా రులకు శు భాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం లోమా జీ ఎంపీపీలు కళ్యాణం రాజే శ్వర్, రాము, కాంగ్రెస్ మండ ల అధ్యక్షులు కె. ప్రతాప్,ఇ. ప్రకాష్ రావు, మాజీ ఎంపీ టీసీలు పి.మాధవ్, వెంకన్న యాదవ్, సర్పంచులు పెం దురు హను మంతు, సంజీ వ్, వినాయక్, నాయకులు ఎల్. ప్రవీణ్ రెడ్డి, జి. సాంబ శివ్, పల్లి విట్టల్,నరసయ్య, సల్ల దేవన్న, జ్ఞానేశ్వర్, దేవ రావు పటేల్, మాజీ సర్పం చ్ రఘు మోహన్ రెడ్డి, రాజు, మాణిక్, ఎస్. కె అలీమ్ తదితర నాయకులు, గ్రామ స్తులు పాల్గొన్నారు.

# కుమ్మరి కుంట గిరిజనుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

**కుమ్మరికుంట గిరిజన గ్రామాన్ని సందర్శించిన రాష్ట్ర ఎస్టీ, ఎస్సీ కమిషన్ చైర్మన్**

**గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి మంద మకరందు**

**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 17, (ప్రజా జ్యోతి)** కుమ్మరి కుంటలో ఉన్న గిరిజనుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంక టయ్య ఆదేశించారు. ఉ ట్నూరు మండలంలోని కుమ్మరికుంట గిరిజన గ్రా మా న్ని తెలంగాణ రాష్ట్ర ఎస్టీ, ఎస్సీ కమిషన్ చైర్మన్, కమి షన్ సభ్యులు, సమగ్రగిరిజన అభివృద్ధి సంస్థ (ఐటీ డీఏ) ఉట్నూరు ప్రాజెక్టు అ ధికారి మంద మకరందు శు క్రవారం సందర్శించారు. గ్రా మంలో పర్యటించిన అధి కారులు స్థానిక గిరిజన కు టుంబాలతో ప్రత్య క్షంగా మాట్లాడి వారి జీవన పరిస్థి తులు, మౌలిక సదుపాయాలు, నివాస సమస్యలు, ప్ర భుత్వ సంక్షేమ పథకాల అమలుపై వివరాలు తెలుసు కున్నారు.ఈ సందర్భంగా గ్రా మస్తులు తమకు శాశ్వత గృహాల అవసరం, భూమి, నివాస హక్కులు, తాగునీరు, రహదారు లు, విద్యుత్ వంటి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చా రు. గ్రామస్థుల సమస్యలను ఎంతో శ్రద్ధగా విన్న రాష్ట్ర ఎ స్టీ, ఎస్సీ కమిషన్ చైర్మన్ సంబంధిత శాఖల అధికారులతో చర్చించి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూ చించారు.ఈ సందర్భంగా ఐటీడీఏ ఉట్నూరు ప్రాజెక్టు అధికారి మంద మకరందు మాట్లాడుతూ, కుమ్మరికుంట గ్రామంలోని ప్రతి అర్హత గిరిజన కుటుంబానికి ప్రభుత్వం అమలు చేస్తున్న ఇంది రమ్మ ఇళ్ల పథకం ద్వారా గృ హ నిర్మాణానికి అవసరమై న అన్ని అర్హతలు, హక్కులు కల్పించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామస్థులు ఎదుర్కొంటున్న సమస్యలను సమగ్రంగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని, త్వరలో ముఖ్యమంత్రితో నిర్వహించే సమా వేశంలో ఈ గ్రామానికి సంబంధించిన స మస్యలను ప్రత్యేకంగా



ప్రస్తావించి, శాశ్వత పరిష్కారం లభించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.గిరిజనుల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి అర్హత గల కుటుంబం ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందేలా ఐటీడీఏ తరపున అన్ని విధాలుగా సహకరిస్తామని ప్రాజెక్టు అధికారి పేర్కొన్నారు. గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధి, గృహ నిర్మాణం, తాగునీరు, రహదారులు, విద్య, ఆరోగ్యం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి సంబంధిత శాఖల సమన్వయంతో వేగంగా చర్యలు చేపడతామని తెలిపారు. ఈ సందర్శన సందర్భంగా కుసురం నీలాదేవి, రేణిగుంట్ల ప్రవీణ్,రాంబాబు నాయక్ కమిషన్ సభ్యులు, ఐటీడీఏ అధికారులు, అటవీ శాఖ, ఆరోగ్య శాఖ, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, గిరిజన కుటుంబాలు పాల్గొన్నారు. గ్రామస్తులు తమ సమస్యలను స్వయంగా తెలుసుకుని పరిష్కారానికి హామీ ఇవ్వడంపై రాష్ట్ర ఎస్టీ, ఎస్సీ కమిషన్ చైర్మన్, కమిషన్ సభ్యులు, ప్రాజెక్టు అధికారి మంద మకరందుకు కృతజ్ఞతలు తెలిపారు.

# గిరిజన గ్రామాల్లో విద్య, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు



ఐటీడీఏ ఉట్నూరు ప్రాజెక్టు అధికారి మంద మకరందు





**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 17, (ప్రజా జ్యోతి)** గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమ ని, గిరిజన విద్యార్థులకు నా ణ్యమైన విద్యతో పాటు అ న్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఐటీడీఏ ని రంతరం కృషి చేస్తోందని సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఐటీడీఏ ఉట్నూరు ప్రాజెక్టు అధికారి మంద మ కరందు అన్నారు. శుక్రవారం ఉట్నూరు మండలంలోని దొంగ చింత గిరిజన గ్రా మంలో ఆయన పర్యటించి గ్రామంలోని పరిస్థితులను పరిశీలించా రు.గ్రామానికి చేరుకున్న ప్రాజెక్టు అధికారికి స్థానిక గిరిజనులు, ప్రజా ప్ర తినిధులు, గ్రామ పెద్దలు సంప్రదాయబద్ధంగా ఘన స్వాగతం పలికారు. అనం తరం గ్రామ అభివృద్ధి, ప్రజల సమస్యలు, విద్యా పరిస్థి తులపై స్థానికులతో మాట్లా డి వివరాలు తెలుసుకున్నా రు.

**అమరవీరులకు ఘన నివాళి**

పర్యటనలో భాగంగా గ్రామంలోని గిరిజన వీరులైన కొమరం సూర్, కొమురం భీమ్ విగ్రహాలకు పూలమా లలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. గిరిజనుల హ క్కులు, జల-జంగల్-జమీన్ పరిరక్షణ కోసం పోరాడిన మహనీయుల సేవలను ఈ సందర్భంగా స్మరించు కున్నారు. వారి ఆశయాలకు అను గుణంగా గిరిజనుల అభ్యు న్నతి కోసం ప్రభుత్వం కట్టు బడి పనిచేస్తోందన్నారు.

**ప్రాథమిక పాఠశాల ఆకస్మిక తనిఖీ**

అనంతరం గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆక స్మికంగా తనిఖీ చేసిన పీవో మంద మకరందు, తరగతి గదులు, విద్యార్థుల హాజ రు, బోధనా విధానం, పాఠ శాల రికార్డులు, మధ్యాహ్న భోజన నిర్వహణ, పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న విద్యాసదు పాయాలు, మౌలిక వసతు లపై అధికారులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు.

**విద్యార్థులతో ముఖాముఖి -- చదువుపై ప్రోత్సాహం**

పాఠశాలలో విద్యార్థులతో ఎంతో ఆప్యాయంగా ముచ్చటించిన ప్రాజె క్టు అధికారి, వారి చదువులు, భవిష్యత్ లక్ష్యాలు, రోజువారీ అభ్యా సం గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకో వాలని సూచించారు. విద్యా ర్థులతో కలిసి కొంతసేపు గ డుపుతూ వారిలో ఆత్మవి శ్వాసం, ఉత్సా హాన్ని నింపా రు.గిరిజన ప్రాంతాల్లో విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడేలా ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని ప్రాజెక్టు అధికా ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన బోధన, పౌష్టి కాహారం, పరిశుభ్రమైన పా ఠశాల వాతావరణం కల్పిం చడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. విధుల్లో నిర్లక్ష్యం, అలసత్వం ప్రదర్శి స్తే ఎట్టి పరిస్థితుల్లోనూ స హించబోమని హెచ్చరించారు .

**గ్రామస్థుల సమస్యలు తెలుసుకున్న పీవో**

పర్యటన సందర్భంగా గ్రామస్తులు తమ గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, శాశ్వత నీటి సౌకర్యం కల్పించాలని ప్రాజెక్టు అధికారిని కోరారు. దీనిపై స్పందించిన మంద మకరం దు సంబంధిత శాఖఅధికా రులతో సమన్వయం చేసి సమస్య పరిష్కా రానికి అవసరమైన చర్యలు చేపట్టాల ని ఆదేశించారు. గ్రామ ప్రజ కు అవసరమైన మౌలిక వ సతులు కల్పించేందుకు ఐ టీడీఏ తరపు న అన్ని విధాలుగా సహకరిస్తామని హామీ ఇచ్చారు.ఈ పర్యటనలో స్థానిక ప్రజా ప్రతి నిధులు, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, ఐటీడీఏ అధికారు లు, సిబ్బంది, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల పనులు వేగవంతం చేయాలి

: కలెక్టర్ హరిత




**ఆసిఫాబాద్, జూలై 17 ప్రజా జ్యోతి** జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం సమీకృత కలెక్టరేట్‌లో జిల్లా విద్యాశాఖ అధికారి సచ్చిదానంద చారితో కలిసి మండల విద్యాధికారులు, పంచాయతీరాజ్, ఈడబ్ల్యూఐడీసీ ఇంజనీరింగ్ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. తరగతి గదుల మరమ్మతులు, అదనపు గదుల నిర్మాణం, క్రీడా మైదానాల అభివృద్ధి, క్రీడా పరికరాల కొనుగోలు, ఇంకుడు గుంతల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాల భవనాల నిర్మాణాలను త్వరగా ప్రారంభించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు పెంచడంతో పాటు కేజీబీవీలు, ఆదర్శ పాఠశాలల్లో ఖాళీ సీట్లను వెంటనే భర్తీ చేయాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజనం నాణ్యత, ఉపాధ్యాయుల హాజరు, ఆధార్--అపార్ నమోదు, యూ-డైస్ పోర్టల్‌లో వివరాల నమోదు, ప్రీ-ప్రైమరీ పాఠశాలల్లో 100 శాతం విద్యార్థుల చేరికపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ హరిత అధికారులను ఆదేశించారు.

## అటవీ అధికారులపై దాడి కేసు.. మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ సహా 8 మందికి జైలు శిక్ష

**అదిలాబాద్ :** కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని సార్సాలలో అటవీ శాఖ అధికారులపై జరిగిన దాడి కేసులో అటవీ అధికారుల పోరాటం ఫలించింది. విధి నిర్వహణలో ఉన్న అటవీ సిబ్బందిపై కర్రలతో దాడి చేసి, రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కేసులో ఎట్టకేలకు ఆదిలాబాద్ కోర్టులో తుది తీర్పు వెలువడింది. ఆనాటి  ఈఖీూ చోళే అనితపై కొందరు వ్యక్తులు అమానుషంగా దాడి చేసిన ఘటనకు సంబంధించి కోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. సుదీర్ఘ విచారణల తర్వాత.. ఆసిఫాబాద్ జిల్లా మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణరావ్‌తో పాటు మరో ఏడుగురిని దోషులుగా నిర్ధారిస్తూ న్యాయస్థానం జైలు శిక్ష ఖరారు చేసింది.కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా సార్సాల అటవీ అధికారులపై దాడి కేసులో 7 ఏళ్ల తర్వాత తీర్పు వెలువడింది. 2019లో రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ ఘటనలో ఆదిలాబాద్ ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక న్యాయస్థానం 8 మంది నిందితులను దోషులుగా నిర్ధారించి, ఒక్కొక్కరికి ఆరు నెలల జైలు శిక్ష విధించింది. 2019 జూన్ 30న ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ మండలంలోని కొత్త సార్సాలలో అటవీ భూమిలో మొక్కలు నాటేందుకు అధికారులు సిబ్బంది వెళ్లారు. దీంతో అక్కడి గ్రామస్థులు అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అయితే అప్పటి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ చోళే అనిత నేతృత్వంలోని బృందంపై కొందరు వ్యక్తులు కర్రలతో దాడి చేయగా, ఎఫ్.ఆర్.ఓ అనితతో పాటు పలువురు అటవీ సిబ్బంది తీవ్రంగా గాయపడ్డారు. అటవీశాఖ సిబ్బందిపై దాడి ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మొత్తం 39 మందిపై హత్యాయత్నం, ప్రభుత్వ విధులకు ఆటంకం కలిగించడం, దాడి, తదితర అభియోగాలతో కేసులు నమోదు చేశారు. డీఎస్పీ సత్యనారాయణ దర్యాప్తు పూర్తిచేసి 2020లో కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు చేశారు. విచారణలో భాగంగా 300 మందికి పైగా సాక్షుల వాంగ్మూలాలు, ఆధారాలను పరిశీలించిన న్యాయస్థానం ఆసిఫాబాద్ జిల్లా మాజీ జడ్పీ వైస్ చైర్మన్    రాజశేఖర్, భూరం మల్లేష్, శ్యామలను దోషులుగా తేల్చి 6 నెలల జైలు శిక్ష విధించింది.

# భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి భూ భారతి భూ ముల సర్వే

గ్రామీణ సమస్యలు త్వరిత గతిన పరిష్కారం

జిల్లా కలెక్టర్ రాజర్షిషా



**బజార్ హత్నూర్, జూలై 17, (ప్రజా జ్యోతి)** భూ సమస్యల పరిష్కారాని కి, వ్యవసాయ రక్షణకు ప్ర భుత్వం ప్రత్యేక చర్యలను చేపడుతుందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శుక్ర వారం బజార్ హత్నూర్ మండలం గంగాపూర్ గ్రామంలో భూ భారతి భూముల సర్వే పై నిర్వహించిన గ్రామసభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం డెడ్రా, మాన్కపూర్ గ్రామాల్లో పర్యటించారు ముందుగా గంగాపూర్ గ్రామంలోని హనుమాన్ ఆలయంలో కలెక్టర్ పూజలు నిర్వహించి, ఈ సందర్భంగా గ్రామ సభలో కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో గతంలో 1934లో జరిగిన సర్వే తర్వాత, మళ్లీ ఇప్పుడు అత్యాధునిక సాం కేతికతతో కూడిన మెషీన్ల ద్వారా భూభారతిరీ-సర్వే ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభించిందని తెలిపారు. జిల్లా లోని మొత్తం 509 గ్రామాలకు గాను, ప్రస్తుతం మొదటి విడతగా 70 గ్రామాలలో ఈ సర్వే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గతంలో నక్ష, రికార్డులు లేని నాన్-కాడస్ట్రల్ గ్రామాలలో మూడు నాలుగు నెలల క్రితమే ఈ సర్వే ను ప్రారంభించామని వెల్లడించారు. ఈరీ-సర్వే ద్వారా గ్రామ సరిహద్దులను నిర్ణయించిన అనంతరం, అగ్రి కల్చర్, నాన్-అగ్రికల్చర్ భూ ములను సర్వే చేసి డిజిట లైజ్ చేస్తామని, దీని ఆధా రంగా ప్రతి ఒక్కరికీ ఆధార్ కార్డు తరహాలోనే భూముల కు 'భూదార్ కార్డ్' అందజే స్తామని స్పష్టం చేశారు. దీని వల్ల భవిష్యత్తులో భూము ల రిజిస్ట్రేషన్లు, కొనుగోళ్లు, అమ్మకాలు పారదర్శకంగా జరుగుతాయని, కుటుంబ సభ్యుల మధ్య గానీ, ఇతరు ల మధ్య గానీ వచ్చే భూ పంచాయితీలకు శాశ్వత ప రిష్కారం లభిస్తుందని పేర్కొ న్నారు. మరోవైపు జిల్లాలో, ముఖ్యంగా బజార్‌హత్నూర్ మండలంలో వర్షపాతం చాలా తక్కువగా నమోదవుతోందని, సూపర్ ఎల్ నినో ప్రభావం వల్ల రైతులు తమ పంటలను కాపాడు కోవడానికి వ్యవసాయ అధికారుల సూచనలను తప్పక పాటించాలని కోరారు. భూమిలో తేమను నిలిపి ఉంచడానికి మల్చింగ్ పద్ధతిని ఉపయో గించాలని, పంటతో పాటు పెరిగే కలుపు మొక్కలను ఎప్పటికప్పుడు తొలగించా లని, 2% ఫోలియర్ స్ప్రే చేయాలని రైతులకు సూచించారు. ఒకవేళ వర్షాలు పూర్తిగా లేని పక్షంలో ప్రత్యా మ్నాయంగా కందులు, పెస ర్లు, మినుములు వంటి ఇతర తక్కువ నీటితో పండే పంటల వైపు వెళ్లాలని, సాగునీటి సదుపాయం లేని రైతులు పంట మార్పిడి చేసుకోవాలని ఉద్ఘాటించారు. గ్రామాభివృద్ధిలో భాగంగా వి. బి.జి.రాంజీ స్కీమ్ కింద గ్రామాల్లో సిసి రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి అవసరమైన శాంక్షన్లు ఇచ్చి పనులను త్వరలోనే ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. భూసర్వే సమయంలో రికార్డుల నమోదు కోసం అధికారులు నోటీసులు ఇచ్చినప్పుడు, రైతులు తమ క్లెయిమ్స్, అభ్యంతరాలను సమర్పించి ఈ ప్రక్రియను విజయవంతం చేయడానికి అధికారుల కు సహకరించాలని కోరారు. మండల వ్యవసాయ అధికారి మహమ్మద్ సౌద్ ఎల్నినో ప్రభావం వలన వర్షపాతం తక్కువ ఉన్నందున పంటల సాగులో పాటించాల్సిన పద్ధతులను, యూరియా బుకింగ్ విధానంపై రైతులకు వి వరించారు.

### డెడ్రా, మాన్కాపూర్ లలో పర్యటన

మండల పరిధిలోని డెడ్రా, మాన్ కాపూర్ గ్రామాల్లో కలె క్టర్ పర్యటించి, స్థానిక సమ స్యలపై సమీక్షించారు. అటవీ శాఖ అనుమతులు వచ్చి నందున ఐటీడీఏ ద్వారా నిలిచిపోయిన రోడ్డు పనుల ను వెంటనే పునః ప్రారంభి స్తామని, 'వీబీజీ రాంజీ' పథకం కింద సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను మంజూరు చేస్తా మని హామీ ఇచ్చారు. అలా గే, ఇందిరమ్మ ఇళ్ల విడుత లలో మాన్ కాపూర్ గ్రామం లోని గుడిసె నివాసితులకు మొదటి ప్రాధాన్యత ఇస్తామ ని స్పష్టం చేశారు. రైతుల సాగునీటి అవసరాల కోసం బోరు, బావి సౌకర్యం ఉన్న వారికి అటవీ శాఖ అనుమ తులతో త్రీ-ఫేజ్ విద్యుత్ అందిస్తామన్నారు. రైతులు గ్రూప్‌గా ఏర్పడి రూ. 9,150 చెల్లిస్తే, కిలోమీటర్ పరిధి వరకు 20 స్తంభాలు, ట్రాన్స్ ఫార్మర్‌ను ఉచితంగా ఏర్పా టు చేస్తామని వెల్లడించారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు తమ పిల్లలను ఆశ్రమ పాఠశాలల్లో చేర్పించి, గురుకుల ప్రవేశ పరీక్షలు రాసేలా ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు అనం తరం మాన్కాపూర్ గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల బోధన కొరకు స్మార్ట్ టివిని ఎడి ప్రభాకర్ కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. విద్యా పట్లతన అంకితభావాన్ని చాటుకున్న ఎడినీ కలెక్టర్ ఈ సందర్భంగా అభినందించారు.ఈ గ్రామసభ, పర్యటనలలో భూ సర్వే శాఖ ఏడి ప్రభా కర్, తహసీల్దార్ శ్యామ్ సుందర్, డెప్యూటీ రేంజ్ ఆఫీసర్ ప్రవీణ్, సర్పంచ్లు సుభాష్, విజయ, అనిల్, ఏ వో సౌద్, ఏఈఓ ప్రవీణ్, ఉ పాధ్యాయుడు దేవ్ రావ్, స్థానిక రైతులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## పక్షవాత బాధితుడు అనిల్‌ను పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు

అనిల్ కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తాం:

గుర్నూలే నారాయణ ఉప్పుల క్రిష్ణ

ఇందిరమ్మ ఇల్లు మంజూరుకు కృషి చేస్తామని కాంగ్రెస్ హామీ



**ఆసిఫాబాద్ జులై 17 ప్రజా జ్యోతి** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండల కేంద్రంలోని అర్జుగూడకు చెందిన సాల్పులా అనిల్ గత మూడు సంవత్సరాలుగా పక్షవాతంతో బాధపడుతూ తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ వాంకిడి మండల అధ్యక్షుడు గుర్నూలే నారాయణ, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఉప్పుల కృష్ణ అనిల్ నివాసానికి వెళ్లి పరామర్శించారు.ఈ సందర్భంగా అనిల్ ఆరోగ్య పరిస్థితిని ఆయన సతీమణి సుజాతను అడిగి తెలుసుకుని కుటుంబ సభ్యులతో మాట్లాడారు. కుటుంబం అత్యంత నిరుపేద పరిస్థితుల్లో జీవనం సాగిస్తోందని గుర్తించిన కాంగ్రెస్ నాయకులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.అలాగే అనిల్ కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయ్యేలా సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. ప్రభుత్వం నుంచి లభించే వైద్య, ఆర్థిక సహాయంతో పాటు ఇతర సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా తమ వంతు సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు.ఠఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 5వ తెలంగాణ పోలీస్ గేమ్స్,స్పోర్ట్స్ మీట్--2026లో పోటీలలో విశేష ప్రతిభ కనబరిచి

# 13 పతకాలు కైవసం చేసుకున్న ఆసిఫాబాద్ జిల్లా పోలీసులు

జిల్లా పోలీస్ కార్యాలయంలో పథకాలు సాధించిన పోలీస్ అధికారులను సిబ్బందిని ప్రత్యేకంగా :

అభినందించి ప్రశాంస పత్రాలు అందజేసిన కొమురం భీం జిల్లా ఎస్పీ నీతిక పంత్:

**జూలై 17, సిర్పూర్(టి) కాన్ఫెన్సీ రెస్పాండెంట్ ప్రజా జ్యోతి:** కొమురం భీం ఆసిఫా బాద్ జిల్లా పోలీసులు మల్కా జ్గిరి పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో నిర్వహించిన సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 7వ తేదీ నుండి 9వ తేదీ వరకు కొనసాగిన 5వ తెలంగాణ పోలీస్ గేమ్స్ మరియు స్పోర్ట్స్ మీట్ 2026 పోటీలలో ఆసిఫాబాద్ జిల్లా పోలీసులు విశేష ప్రతిభ కనబరిచి 13 పథకాలు సాధించారు. అట్టి సందర్భంలో ఈరోజు జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ నీతిక పంత్ అభినందన కార్యక్రమం ఏర్పాటు చేసి అత్యుత్తమ ప్రతిభ కనబరిచి13 పథకాలు సాధించిన కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పోలీసు అధికారులను, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. ఆసిఫా బాద్ జిల్లా పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ (1)ఎస్. వినయ్ కుమార్ (ట్రైక్వాండో 63 కేజీల విభాగంలో) స్పెషల్ పార్టీ కానిస్టేబుల్ (2)ఆర్. శ్రీకాంత్,(ఆర్మ్ రైజిలింగ్ 100 కేజీల విభాగంలో) స్పెషల్ పార్టీ కానిస్టేబుల్(3)బి.చక్రవర్తి,(ఆర్మ్ రెజ్లింగ్ 55 కేజీల విభాగంలో) గోల్డ్ మెడల్స్ సాధించాలని అన్నారు. అదేవిధంగా ఏఆర్ కానిస్టేబుల్ (4)ఎల్ ఫుల్ సింగ్ (ట్రైక్వాండో మరియు కరాటే) లో 2 పథకాలు సాధించాలని తెలిపారు.(5) స్పెషల్ పార్టీ కానిస్టేబుల్ అక్బర్ ఆర్మ్ రెజ్లింగ్ (65 కేజీల విభాగం) సిల్వర్ మెడల్స్ సాధించాలని తెలిపారు. (6)ఆర్ఎస్ఐ జె. లవన్ కుమార్, యోగ గ్రూప్స్ మరియు సింగిల్ విభాగాల్లో 2 పథకాలు సాధించాలని అన్నారు. స్పెషల్ పార్టీ కానిస్టేబుల్ (7) ఎం. సాయి కుమార్,యోగ (గ్రూప్స్ మరియు సింగల్) 28బి 35 సంవత్సరాల వయసు భాగంలో 1 పథకం సాధించారని అన్నారు. అదేవిధంగా (8)ఏఆర్. కానిస్టేబుల్, ఫుల్ సింగ్ బాక్సింగ్, స్పెషల్ పార్టీ కానిస్టేబుల్ (9)జి.వినేష్ యోగ (18బి 29 వయస్సు భాగం) లో 2 పథకాలు కైవాసం చేసుకున్నారని అన్నారు. మరియు (10) స్పెషల్ పార్టీ కానిస్టేబుల్ కే. సాయికిరణ్, యోగ (18బి 29 వయసు విభాగం) 1 పథకం సొంతం చేసుకున్నారని తెలిపారు.ఈ13 పథకాలు సొంతం చేసుకున్న వీరిని జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించి ప్రశాంస పత్రలు అందజేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ నితికా పంత్ మాట్లాడుతూ.. పోలీస్ అధికారులు, సిబ్బంది విధి నిర్వహణతో పాటు క్రీడల్లోనూ తమ ప్రతిభ ను చాటుకోవడం అభినందనీయమని అన్నారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని, క్రమశిక్షణను పెంపొందిస్తాయని తెలిపారు. జిల్లా పోలీస్ శాఖకు కీర్తి ప్రతిష్టలు తీసుకువచ్చిన పోలీస్ అధికారులను సిబ్బందిని అభినందించి ప్రశాంస పత్రలు అందజేయడం సంతోషకరమని అన్నారు. జిల్లా పోలీస్ శాఖలకు కీర్తి ప్రతిష్టలు తీసుకువచ్చి వచ్చిన వారిని అభినందించడం వారిలో ఎంకరేజ్ చేయడంతో పాటు భవిష్యత్తు లో జరగబోయే రాష్ట్ర, జాతీయ స్థాయి పోలీస్ క్రీడా పోటీల్లో కూడా ఇదే స్ఫూర్తితో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా పోలీస్ శాఖకు మరింత పేరు ప్రతిష్టలు తీసుకురావాలని జిల్లా ఎస్పీ నీతిక పంత్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ (స్పెషల్ పార్టీ) శ్రీనివాస్, ఆర్.ఎస్.ఐ లవన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.









## రీ సర్వేను పకడ్బందీగా పూర్తి చేయాలి:

## జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా

**కరీంనగర్ :** తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి గ్రామంలో నాన్ కెడస్ట్రాల్ రీసర్వే పనులను శుక్రవారం జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మొదట పరిశీలించారు. తర్వాత చిగురుమామిడి మండలం ఉల్లంపల్లి గ్రామంలో ఎంజాయ్ మెంట్ రీ సర్వే పనులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. రీ సర్వే ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా, పకడ్బందీగా చేపట్టి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా కొత్తపల్లి , ఉల్లంపల్లి గ్రామాల్లో ఇప్పటివరకు ఎంత విస్తీర్ణంలో రీ సర్వే పూర్తయింది, ఇంకా ఎంత మేర చేపట్టాల్సి ఉంది, పనులు ఎన్ని రోజుల్లో పూర్తవుతాయనే వివరాలను రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామాల్లో భూమి విస్తీర్ణం ఎంత ఉందని ఆరా తీశారు. సర్వే నంబర్ల వారీగా ఎలాంటి పొరపాట్లు లేకుండా ఖచ్చితత్వంతో రీ సర్వే నిర్వహించాలని కలెక్టర్ సూచించారు.భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా భూముల రీ సర్వే కార్యక్రమాన్ని చేపడుతోందని కలెక్టర్ తెలిపారు. ఈ రీసర్వేలో భాగంగా గ్రామ సరిహద్దులను నిర్ధారించి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, అత్యాధునిక సర్వే పరికరాల సహాయంతో వ్యవసాయ భూములను సర్వే చేయనున్నట్లు చెప్పారు. సర్వే పూర్తయిన అనంతరం భూ వివరాలను ప్రజలకు ప్రకటిస్తామని పేర్కొన్నారు. గ్రామస్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పారదర్శకంగా రీ సర్వే ప్రక్రియను నిర్వహించాలని, ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు యుద్ధ ప్రాతిపదికన పనులను పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. మొదట గ్రామ బౌండరీ పై లైసెన్సుడ్ సర్వేయర్లు, మండల సర్వేలు కలిసి రీ సర్వే చేస్తారని. తర్వాత ఒక్కొక్క రైతు వారిగా రీ సర్వే నిర్వహిస్తారని తెలిపారు. కరీంనగర్ జిల్లాలో మొదటి విడతగా 70 గ్రామాల్లో రీ సర్వే చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించిందని తెలిపారు. ప్రస్తుతం 7 గ్రామాల్లో ఎంజాయ్మెంట్ రీసర్వే కొనసాగుతుందని పేర్కొన్నారు.తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి గ్రామంలో నాన్ కెడస్ట్రాల్ రీ సర్వే చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీఓ షర్మిల తహసీల్దారులు శ్రీనివాస్ రెడ్డి, కనకయ్య, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఫీజుల స్కీము ఎత్తి వేయాలనే

## కుట్రలు మానుకోవాలి

**ఉనీ.జెనీ.9 రద్దు చేసి – పాత పద్దతిలో ఈ స్కీమును అమలు చేయాలి**

**ఫీజుల బకాయిలు 8వేల కోట్లు చెల్లించాలని హైదరాబాద్ కలెక్టరేట్ ముట్టడి**

**హైద్రాబాద్ :** రాష్ట్రంలో 14 లక్షల మంది కాలేజీ విద్యార్థుల ఫీజుల బకాయిలు 8 వెలకోట్లు వెంటనే విడుదల చేయాలని, ఈ స్కీము ఎత్తివేయాలనే కుట్రలు మానుకోవాలని, ఈ స్కీమునుయధాతథంగా పాత పద్ధతిలోనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వేలాది మంది విద్యార్థులు శుక్రవారం హైదరాబాద్ కలెక్టరేటుముట్టడించారు. ఈ ప్రదర్శనకు రాష్ట్ర బీసీ విద్యార్థి సంఘం కన్వీనర్ నిఖిల్ పటేల్, నీల వెంకటేష్ నాయకత్వం వహించారు.ఈ సందర్భంగా విద్యార్థు అర్ధ నగ్న ప్రదర్శన నిర్వహిస్తూ మాకు న్యాయం చేయండి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ ఈ స్కీముకు బడ్జెట్ ఇవ్వకుండా ముఖ్యమంత్రి పేద కులాల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని విమర్శించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలు చదువుకుంటుంటే కూడా ఓర్వలేక పోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నారు. పేద కులాలు చదువుకోకుండా కుట్రలు చేస్తున్నారు. ఫీజుల రియంబర్స్మెంట్ పథకాన్ని రద్దు చేసి కుట్ర చేస్తున్నారు అంటే 23 వేల ప్రభుత్వ పాఠశాలను రద్దు చేస్తామని బహిరంగంగా ముఖ్యమంత్రి ప్రకటించారు. అలాగే ఎంతో ఉన్నత విద్య ప్రమాణాలతో బలహీన వర్గాల జీవితాల మార్పు, అభివృద్ధి చేస్తున్న గురుకులాలను కులాల పేరు మీద వద్దు అంటూ పెద్ద సంస్కర్త లాగా పలుకుతూ రద్దు చేసే కుట్రకు తెర తీస్తున్నారని విమర్శించారు.ఈ ముట్టడి కార్యక్రమంలో చేరుకుల రాజెందర్ ,నిఖిల్ ఎటిట్, అనంతయ్య, , కిరణ్ కుమార్, మోహన్ వంశీ, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## నీట్ 2026 ఫలితాలలో

## అగ్రస్థానంలో శ్రీ చైతన్య విద్యార్థులు

నీట్ 2026 ఫలితాలలో ఆల్ ఇండియాలోనే శ్రీ చైతన్య విద్యార్థులు అగ్రస్థానంలో నిలిచారని శ్రీ చైతన్య విద్యాసంస్థల అకాడమిక్ డైరెక్టర్ శ్రీమతి సుష్మ,సీమ బొప్పన తెలియజేశారు. ఆల్ ఇండియా ఓపెన్ క్యాటగిరిలో మొదటి ర్యాంకు, ఆల్ ఇండియా ఓపెన్ క్యాటగిరిలో తెలుగు రాష్ట్రాలు సాధించిన టాప్ 10లో ఎనిమిది ర్యాంకులు చైతన్య విద్యార్థులు